Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 112 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 మే 2023 ఆదివారం పేజీలు : 4

## కర్ణాటకలో మేము చేసిన తప్పులే బీజేపీని ముంచాయి

హైదరాబాద్: కర్ణాటకలో బీజేపీ ఓటమిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. కర్ణాటకలో తాము చేసిన తప్పులే బీజేపీని ముంచాయన్నారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం చేసిన పొరపాట్లు కారణంగానే తాము ఓడిపోయామని చెప్పారు. కర్ణాటకలో బీజేపీ ఒక తప్పు చేస్తే.. తెలంగాణలో బీఆర్ఎస్ వంద తప్పులు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేస్తారని తెలిపారు. కర్ణాటక ప్రజల తీర్పును శిరసా వహిస్తామన్నారు. తప్పులను సరిచేసుకుని లోకసభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్నటువంటి స్థానిక ప్రభుత్వం మీద ఉన్నటువంటి వ్యతిరేకత వల్లే తాము ఓడిపోయామన్నారు. తొందర్లోనే తమకు ఉన్న లోపాలను సరిదిద్దుకొని ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణలో బీఆర్ఎస్‌కు బాగా ధైర్యం వస్తుందోన్న ప్రచారం ఒట్టిదే అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



## కన్నడనాట.. 'హస్త'వాసిని మార్చిన

# 'పంచ'తంత్రం

వరుస ఓటములతో అస్థిత్వాన్ని కోల్పోయే ప్రమాదం అంచు వరకు వెళ్లిన హస్తం పార్టీ.. తిరిగి బలంగా పుంజుకుంది. ఏడాది ఆరంభంలో హిమాచల్‌ప్రదేశ్ ఇచ్చిన విజయోత్సాహం.. కాంగ్రెస్ నేతల్లో బూస్ట్ నింపింది. అదే జోరుతో ఇప్పుడు దక్షిణాదిలో కీలక రాష్ట్రమైన కర్ణాటక ను చేజిక్కించుకుంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి శనివారం వెలువడిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆ పార్టీ ఘన విజయం సాధించింది. మరి వారి 'హస్త'వాసిని మార్చిన కాంగ్రెస్ 'పంచ'తంత్రం ఏంటో చూద్దాం..!

**సానుభూతి పనిచేసింది..** 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం రాలేదు. భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించినా.. జేడీఎస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ సంకీర్ణ ప్రభుత్వం ఎంతోకాలం నిలబడలేదు. ఏడాది తిరిగేసరికి కొందరు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కూటమి ప్రభుత్వం కుప్పకూలింది. ఆ తర్వాత భాజపా అధికారంలోకి వచ్చింది. అయితే తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలంతా తర్వాత భాజపాలో చేరి పదవులు దక్కించుకున్నారు.

దీంతో సంకీర్ణ ప్రభుత్వం కూలడానికి భాజపానే కారణమనే ఆరోపణలు వచ్చాయి. ఈ వార్తలు ప్రజల్లోకి బలంగా వెళ్లి కాంగ్రెస్‌కు సానుభూతి లభించింది. తాజా ఎన్నికల్లోనూ హస్తం నేతలు తమ ప్రచారంలో దీన్ని అస్త్రంగా మల్చుకున్నారు. ఆ వ్యూహం ఫలించి భాజపాకు ప్రతికూల గాలి వీచింది.

**40శాతం కమీషన్ సర్కార్ నినాదం..** భాజపా నేత బసవరాజ్ బొమ్మై సర్కారుపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీన్ని తమ ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకున్న కాంగ్రెస్.. భాజపా ప్రభుత్వాన్ని '40శాతం కమీషన్ సర్కార్' అని అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించింది. అదే సమయంలో అవినీతి వ్యవహారానికి సంబంధించిన కేసులో రాష్ట్ర మంత్రి ఈశ్వరప్పపై కేసు నమోదవడం బొమ్మై ప్రభుత్వాన్ని కుదిపేసింది. మరో ఎమ్మెల్యే విరూపాక్షప్ప నివాసంలో కోట్లాది రూపాయల ధనం దొరకడం సంచలనంగా మారింది. దీన్ని తమకు అనుకూలంగా మాల్చుకున్న కాంగ్రెస్.. కమీషన్ సర్కారును సాగనంపాలంటూ ప్రచారం చేసింది. ఈ నినాదం బలంగా పనిచేసింది. దీంతో పాటు 'పేసీఎం' అంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారం జనాల్లోకి వెళ్లింది.

**ఫలించిన 'హిమాచల్' వ్యూహం :** హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో తమకు గెలుపు సాధించిపెట్టిన వ్యూహాన్నే.. కాంగ్రెస్ కర్ణాటకలోనూ అమలు చేసింది. హిమాచల్ మాదిరిగానే ఇక్కడా 'ఐదు గ్యారెంటీ'లను ప్రకటించింది. గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చింది. గృహలక్ష్మి పథకం కింద 1.5 కోట్ల గృహిణులకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,000 ఆర్థిక సహాయం అందిస్తామని, అన్నభాగ్య పథకం కింద నిరుపేద కుటుంబాలకు 10 కిలోల ఉచిత బియ్యం అందిస్తామని హస్తం పార్టీ ప్రకటించింది. యువ నిధి యోజన కింద నిరుద్యోగ పట్టభద్రులు, డిప్లొమా పట్టాదారులకు నెలకు రూ.3,000, రూ.1,500 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రభుత్వ రవాణా వాహనాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పిస్తామని వాగ్దానాలు గుప్పించింది. భాజపా అమలుచేసిన జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)ని రద్దుచేసి కర్ణాటక విద్యావిధానం (కేఈపీ)ని అమలు చేస్తామని తెలిపింది. భాజపా తీర్మానించిన ముస్లింలకు 4% రిజర్వేషన్ రద్దు తొలగించి, ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 7% రిజర్వేషన్ కల్పిస్తూ.. జనాభా ఆధారంగా రిజర్వేషన్ ప్రమాణాలను సవరిస్తామని పార్టీ తెలిపింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న 50% రిజర్వేషన్లను 75%కు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇలా కాంగ్రెస్ ప్రకటించిన పలు ఉచితాలు, ఆకర్షణీయ పథకాలు ఓటర్లను ఆకట్టుకున్నాయి.

**జోడో యాత్ర నింపిన జోష్.. :** దేశ ప్రజలను ఏకతాటిపైకి తేవడంతో పాటు దేశంలో భాజపాయేతర శక్తి బలంగా ఉందని చాటిచెప్పడం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'.. కర్ణాటకలో పార్టీకి కొత్త ఊపునిచ్చింది. మొత్తం 140 రోజులకు పైగా సాగిన ఈ యాత్రలో.. అత్యధికంగా 21 రోజులు రాహుల్ కర్ణాటకలో నడిచారు. చామరాజనగర్ జిల్లాలోని గుండ్లుపేటె నుంచి మొదలుపెట్టి మొత్తం 511 కి.మీ రాష్ట్రంలో పర్యటించారు. మైసూరు, మాండ్య, తుమకూరు, చిత్రదుర్గ, బళ్లారి తదితర జిల్లాల్లో ఈ పర్యటన సాగింది. యాత్ర మధ్యలో వర్షంలోనూ రాహుల్ ఓ బహిరంగ సభలో ప్రసంగించిన ఫొటోలు అప్పట్లో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా మాండ్యలో జోడో యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవికి రాష్ట్రానికి చెందిన సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే ఎన్నిక కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.

**డీకే–సిద్ధూ ఐకమత్యం.. :** 'కాంగ్రెస్‌లో అందరూ సీఎం అభ్యర్థులే'.. గతంలో హస్తం పార్టీని ఉద్దేశిస్తూ భాజపా చురకలంటించిందిలా. తాజా ఎన్నికల్లోనూ కాషాయ పార్టీ ఇలాంటి విమర్శలు గుప్పించే ప్రయత్నం చేసింది. కానీ, కాంగ్రెస్ వాటిని పారనివ్వలేదు. పార్టీలో అంతర్గతంగా విభేదాలు వచ్చినా.. వాటిని బయటికి రాకుండా పరిష్కరించుకుంది. ఎన్నికల సందడి మొదలైనప్పటి నుంచి పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య ఐకమత్యంగా కన్పించారు. ఇక, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా డీకే సమర్థంగా వ్యవహరించారు. పార్టీలో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తేవడంలో సఫలమయ్యారు. పార్టీలో మంచి ట్రబుల్‌షూటర్‌గా పేరున్న శివకుమార్.. ఐటీ దాడులను ఎదుర్కొని నిలబడ్డారు. పార్టీ శ్రేణుల్లో విశ్వాసాన్ని నింపారు. ఇక భాజపా డబుల్ ఇంజిన్ సర్కారు అన్నప్పుడల్లా.. తమది జోడెద్దుల(డీకే–సిద్ధూను ఉద్దేశిస్తూ) బండి అని కాంగ్రెస్ కౌంటర్ ఇవ్వడం ఓటర్లను ఆకట్టుకుంది. బొమ్మై సర్కారుపై వచ్చిన వ్యతిరేకతను.. సిద్ధూ–డీకే తమకు అనుకూలంగా మల్చుకుని చేసిన ప్రచారం హస్తానికి కలిసొచ్చింది.

## బీజేపీ పుట్టి ముంచిన మూడు కారణాలు.. కర్ణాటకలో ఘోర వైఫల్యం!

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి చావు తప్పిన పరిస్థితి కనిపించింది. అంటే.. ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకోకుండా.. అంతో ఇంతో కొన్ని సీట్లను దక్కించుకున్నామనే సంతృప్తి మిగిలింది. వాస్తవానికి వరుస ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలన్న.. ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పానికి తోడు కర్ణాటక వంటి కీలకమైన దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేయడం ద్వారా.. కమలం పార్టీని పుంజుకునేలా చేయాలని .. వ్యూహాలు వేశారు. అయితే.. కేవలం 68 స్థానాలకే ఇప్పుడు పరిమితం కావాల్సిన పరిస్థితి ఉంది.



అయితే.. ప్రస్తుతం బీజేపీ వైఫల్యానికి కారణాలు అన్వేషిస్తే.. ప్రధానంగా మూడు కనిపిస్తున్నాయి. ఒకటి కీలకమైన ముస్లింల రిజర్వేషన్ను రద్దు చేయడం.. రెండు రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం కమీషన్ ప్రభుత్వం నడుస్తోందన్న విమర్శలు.. వ్యాఖ్యలు.. ప్రజల పెదవి విరుపులను కూడా పట్టించుకోకుండా.. ఎదురు దాడి చేయడం.. మూడు కీలకమైన లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన జగదీష్ శెట్టర్ను పార్టీ నుంచి అవమానకరంగా బయటకు పంపేయడం వంటివి కమల నాథులకు కోరి తెచ్చుకున్న వైఫల్యాలుగా చెబుతున్నారు. కీలకమైన ముస్లింలకు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 4 శాతం రిజర్వేషన్ కల్పించింది. అయితే.. దీనిని ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు బొమ్మై ప్రభుత్వం రద్దు చేసింది. దీనిని కాంగ్రెస్ అందిపుచ్చుకుని తాము అధికారంలోకి వస్తే. 6 శాతం చేస్తామని ఇచ్చిన హామీ బాగా ముస్లిం వర్గాల్లో పనిచేసింది. ఇక లింగాయత్ ఓట్లు తమకే పడతాయని చెప్పిన కమల నాథులు.. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ సీఎం జగదీష్ శెట్టర్కు టికెట్ ఇవ్వకుండా అవమానించారనేది ఆ సామాజికవ ర్గం ఓట్లను దూరం చేసింది.

అదేసమయంలో ఊరూ వాడా కూడా.. రాష్ట్రంలో అవినీతిప్రభుత్వం పాలనచేస్తోందని చెప్పినా.. మోడీ వంటివారు వినిపించుకోలేదు. పైగా ఎదురు దాడి చేశారు. వీటికితోడు.. కొత్తముఖాలను పరిచయం చేస్తున్నామనే పేరిట సీనియర్లను పక్కన పెట్టడం కూడా.. కలిసి రాలేదు. మొత్తంగా చూస్తే.. బీజేపీ తన వైఫల్యాలకు తగిన మూల్యం చెల్లించుకుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

## నడచిన చోటల్లా గెలుపు విత్తనాలు నాటిన రాహుల్

రాహుల్ గాంధీ కర్నాటక ఎన్నికల ప్రచారంలో మామూలుగానే పాల్గొన్నాడు. ఆయన కంటే ఎక్కువగా సోదరి ప్రియాంకా గాంధీ కర్నాటక మొత్తం కలియతిరిగారు. అయితే రాహుల్ గాంధీ గత ఏడాది దేశంలో నిర్వహించిన భారత్ జోడో యాత్ర ఎఫెక్ట్ కర్నాటక ఎన్నికల మీద పడింది అని అంటున్నారు. రాహుల్ 2022 సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి భారత్ జోడో యాత్రను మొదలెట్టారు. ఆయన కర్నాటక కు సెప్టెంబర్ 30కి చేరుకున్నారు. అక్టోబర్ 23 వరకూ ఏకంగా మూడు వారాల పాటు అలుపు లేకుండా పాదయాత్ర చేశారు. మొత్తం ఏడు జిల్లాలలో ఈ పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్ర సందర్భంగా ఆయన చామరాజనగర్ మైసూర్ మాండ్యా తమకూరు చిత్రదుర్గ బళ్లారి రాయచూరు జిల్లాలలో కదం తొక్కారు. దాంతో ఆ జిల్లాల పరిధిలో ఉన్న మొత్తం 51 అసెంబ్లీ సీట్లకు గానూ ప్రస్తుతం కాంగ్రెస్ ముప్పయి ఆరు సీట్లను గెలుచుకుంది అని తాజా ఫలితాలు చెబుతున్నాయి. ఇందులో చామరాజనగర్ జిల్లాలో మొత్తం నాలుగు అసెంబ్లీ సీట్లు ఉంటే మూడింటిని కాంగ్రెస్ గెలుచుకుంది మసూరు లో 11 సీట్లు ఉంటే ఎనిమిది కాంగ్రెస్ వైపు ఉన్నాయి. మాండ్యాలో ఏడు సీట్లు అయిదు కాంగ్రెస్ గెలుచుకుంది. తమకూరులో మొతం ఆరు ఉంటే కాంగ్రెస్ కి అయుదు సాధించింది. బళ్లారి మొత్తానికి అయిదుకు అయిదూ క్లీన్ చేసింది కాంగ్రెస్. రాయచూరు లో ఏడు సీట్లు ఉంటే నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. ఇలా రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఎఫెక్ట్ కర్నాటక ఎన్నికల మీద చాలా ఎక్కువగా పడింది అని అంటున్నారు. ఈ యాత్ర సందర్భంగానే రాహుల్ కర్నాటక ఎన్నికల కార్యాచరణను రెడీ చేశారు. ఒక వైపు సిద్ధరామయ్య మరో వైపు డీకే శివకుమార్ ఉంటే ఇద్దరినీ కలిపి ఉంచడం ద్వారా ఆయన కాంగ్రెస్ లోకల్



లీడర్ షిప్ ని పటిష్టం చేశారు. దాంతో తాజా ఫలితాలు కూడా అద్భుతంగా వచ్చాయని అంటున్నారు. దానికి తోడు అన్నట్లుగా ప్రియాంకా గాంధీ మొత్తం ఎన్నికల బాధ్యతలను తన భుజాల మీద వేసుకుని కర్నాటక అంతటా విస్తృతంగా పర్యటించింది. ఆమె చాలా ఎక్కువ నియోజకవర్గాలను కవర్ చేశారు. ప్రజలు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడానికి రాహుల్ పాదయాత్ర ఒక కారణం అయితే ప్రియాంకా గాంధీ ఉధృత ప్రచారం మరో ఎత్తు అని అంటున్నారు. కాంగ్రెస్ కి కర్నాటకలో ఆది నుంచి పట్టు ఉంది. దాన్ని మరోసారి నిరూపించుకుంది అని అంటున్నారు. మొత్తానికి రాహుల్ పాదయాత్ర కష్టం ఊరకే పోలేదు అని విశ్లేషిస్తున్నారు. తాను నడచిన బాటలో కాంగ్రెస్ కి గెలుపు విత్తనాలు నాటారని అంటున్నారు.

## 'చామరాజనగర్' సెంటిమెంట్..

# ఆనవాయితీ రిపీట్




## కాంగ్రెస్ అఖండ విజయం

కన్నడనాట రాజకీయ ఆనవాయితీ పునరావృతమైంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. అంతేనా.. కర్ణాటక ఎన్నికల్లో ఓ పార్టీ ఈ స్థాయిలో మెజార్టీ దక్కించుకోవడం దాదాపు 34 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం విశేషం. ఈ సందర్భంగా తాజా ఫలితాల్లో కొన్ని ప్రత్యేకతలివే..

**38 ఏళ్లుగా అదే సంప్రదాయం..** కర్ణాటకలో గత 38 ఏళ్లుగా ఏ పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి రాకపోవడం ఆనవాయితీగా వస్తోంది. 1983, 1985 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు జనతా పార్టీ మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మళ్లీ సిట్టింగ్ ప్రభుత్వం ఎన్నికల్లో గెలవలేదు. 2013లో కాంగ్రెస్ గెలవగా.. 2018 ఎన్నికల్లో భాజపా అత్యధిక స్థానాల్లో గెలుపొందింది. అయినప్పటికీ జేడీఎస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి వరుసగా రెండోసారి నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే, ఈ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయి మళ్లీ భాజపానే అధికారంలోకి వచ్చింది. తాజా ఎన్నికల్లో మరోసారి ఓటర్లు అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. హస్తం పార్టీకి పట్టంగట్టారు.

**చామరాజనగర్ 'శాపం' నిజమేనా? :** చామరాజనగర్ జిల్లా రాష్ట్ర ముఖ్యమంత్రుల పాలిట శాపంగా మారిందనే అపవాదును దశాబ్దాలుగా మోస్తూనే ఉంది. చామరాజనగర్‌లో అడుగుపెట్టిన సీఎం.. ఆ పదవిని కోల్పోతారనే నమ్మకం కన్నడనాట పాతుకుపోయింది. తాజా ఫలితాలతో ఇది మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై రెండుసార్లు ఈ జిల్లాలో పర్యటించారు. ఫలితాల్లో భాజపా ఓటమిపాలవ్వడంతో బొమ్మై సీఎం పీఠం దిగకతప్పట్లేదు.

**రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం..** మే 10వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 73.19శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఈ స్థాయిలో ఓటింగ్ నమోదవ్వడం ఇదే తొలిసారి. 2013లో 71.83శాతం, 2018లో 73.36శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో భాజపా ఓటు షేరు 46శాతంగా ఉండగా.. కాంగ్రెస్‌కు 43శాతం షేరు దక్కింది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు 39.9శాతం ఓట్లు పడగా.. భాజపాకు 36 శాతం ఓటు షేరు దక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఓటు షేరు 44శాతంగా ఉండగా.. భాజపాకు 36శాతం ఓట్లు దక్కాయి. ఇక సెమీ రూరల్‌లో కాంగ్రెస్‌కు 44శాతం ఓట్లు పడగా.. భాజపాకు 29శాతం ఓటు షేరు దక్కింది. ఆ ఇద్దరు మినహా.. కర్ణాటకలో ఇప్పటివరకు 16 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో జరిగాయి. కానీ, మొత్తంగా ఇద్దరే ఇద్దరు నేతలు పూర్తిస్థాయిలో ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. 1972లో దేవ్‌రాజ్ అర్స్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా ఆయనే.. ఐదేళ్ల పాటు సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ 2013లో కాంగ్రెస్ హయాంలోనే సీనియర్ నేత సిద్ధరామయ్య ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. మిగతా అన్ని సందర్భాల్లో సీఎం కుర్చీని నేతలు/పార్టీలు పంచుకోవడం లేదా ముందస్తు ఎన్నికలకు వెళ్లడం జరిగింది. ఈసారి కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధించింది. అయితే ఇప్పటికీ సీఎం ఎవరన్నది మాత్రం ఇంకా స్పష్టత లేదు.

**34 ఏళ్ల తర్వాత అత్యధిక మెజార్టీ..** తాజాగా వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 136 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీకి ఈ స్థాయిలో మెజార్టీ దక్కడం 34 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం విశేషం. 1989లో కాంగ్రెస్ ఏకంగా 178 స్థానాల్లో విజయం సాధించింది. ఆ తర్వాత 1994లో జనతాదళ్‌కు 115 స్థానాలు దక్కాయి. 1999లో కాంగ్రెస్ 132 సీట్లు గెలుచుకోగా.. 2004, 2008 ఎన్నికల్లో హంగ్ ఏర్పడింది. 2013లో కాంగ్రెస్ 122 స్థానాలు దక్కించుకోగా.. 2018 ఎన్నికల్లో మళ్లీ హంగ్ వచ్చింది.

## సంపాదకీయం

### జీవించి ఉన్న సీఎంల జాబితాలో కర్ణాటక రికార్డ్!

కర్ణాటక రాష్ట్రం 1956లో ఏర్పాటైంది. అప్పటి నుంచి ముఖ్యమంత్రి పదవిని పూర్తిగా ఐదేళ్లు నిర్వహించిన వారు కేవలం ముగ్గురే ఉన్నారు. ఎస్ నిజలింగప్ప (1962-68) డీ దేవరాజ ఉర్స్ (1972-77) సిద్దరామయ్య (2013-2018) మాత్రమే పూర్తి పదవీ కాలం నిర్వహించారు. ఇక ఈ రికార్డుతోపాటు... ఎక్కువ కాలం జీవించి ఉన్న ముఖ్యమంత్రుల జాబితాలోనూ కర్ణాటక రికార్డు సాధించింది. మొత్తం 18 మంది ముఖ్యమంత్రులుగా పనిచేస్తే.. వీరిలో 8 మంది జీవించి ఉన్నారు. బీజేపీ జేడీఎస్ నేతలు ముఖ్యమంత్రి పదవిని ఐదేళ్ళ కాలం పూర్తిగా నిర్వహించలేకపోయారు. బీజేపీ-జేడీఎస్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు హెచ్డీ కుమార స్వామి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈ ప్రభుత్వం 2006 ఫిబ్రవరి నుంచి 2007 అక్టోబరు వరకు మాత్రమే ఉంది. బీజేపీ నేతకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టడానికి కుమార స్వామి ససేమిరా అనడంతో ఈ ప్రభుత్వం కూలిపోయింది. కాంగ్రెస్ జేడీఎస్ కలిసి 2018లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో కుమార స్వామి రెండోసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. బీజేపీ నేత బీఎస్ యెడియూరప్ప 2007లో మొదటిసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. జేడీఎస్ మద్దతు ఉపసంహరించడంతో ఆయన ఏడు రోజులకే పదవిని కోల్పోయారు. అనంతరం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. యెడియూరప్ప నేతృత్వంలో బీజేపీ 2008 మే నెలలో కర్ణాటకలో ఘన విజయం సాధించింది. ఆయన రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన 2011 జూలైలో పదవి నుంచి వైదొలగారు. ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయ్ 2021 జూలైలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జీవించి ఉన్న ముఖ్యమంత్రులు వీరే.. దేవెగౌడ ఆయన కుమారుడు కుమారస్వామి యడియూరప్ప ఎస్ ఎం. కృష్ణ సిద్దరామయ్య వీరప్ప మొయిలీ సదానందగౌడ జగదీశ్ శెట్టర్. ఇక్కడ చిత్రం ఏంటంటే.. ఏ రాష్ట్రంలోనూ ఇంత మంది మాజీసీఎంలు లేకపోవడం.

# పోలీసుల గూడు.. ఎలా ఉందో చూడు




ఆదిలాబాద్ : పట్టణంలోని శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన పోలీసు సబ్ కంట్రోల్ గదులకు నిర్వహణ కరవైంది. ఆయా కూడళ్లలో విధులు నిర్వహించే పోలీసులకు ఎండ, వానల నుంచి రక్షణ కోసం వీటిని నిర్మించారు. వర్షం కురుస్తున్నా, తీవ్రమైన ఎండ ఉన్నా.. పోలీసులు ఇందులో నుంచి అన్ని వైపులా నిఘా కొనసాగించటానికి నాలుగు వైపుల ఇనుప జాలీలను ఏర్పాటు చేశారు. ఈ గదులు దుమ్ము, ధూళితో నిండిపోయాయి. కొన్నిచోట్ల ఈ గదులను కూరగాయల వ్యాపారులు వారి కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు. పోలీసు సబ్ కంట్రోల్ గదుల నిర్వహణ తీరుపై పరిశీలన కథనం..

గచ్చు పగిలిపోయి..ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని పోలీసు సబ్ కంట్రోల్ గది నిర్వహణ లేక శిథిలమైంది. ద్వారం వద్ద గచ్చు పూర్తిగా పగిలి దిగబడిపోయింది. ఈ గదిలోనే కొందరు వ్యాపారులు కూరగాయల క్రేట్లు(డబ్బాలు) దాచుకుంటున్నారు. ఈ గదిలో నుంచి పోలీసులు బయట నిఘా ఉంచటానికి వీల్లేకుండా కొందరు జాలీలకు బ్యానర్లు కట్టేశారు.

ఎండ, వానల్లోనే విధులు..

ఈ చిత్రం ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలో ఉన్న రైల్వే గేటు వద్దది. ఇక్కడ వాహన రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ప్రమాదాలు జరగకుండా నిఘా కొనసాగించే ట్రాఫిక్ పోలీసులకు ఎండ, వాన నుంచి ఎలాంటి రక్షణ లేకుండా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వర్షం వస్తే విధులను పక్కనబెట్టి తడవకుండా ఉండటానికి సమీపంలోని వేప చెట్టు వద్దకు లేదా ఏదైనా దుకాణంలోకి పరుగెత్తి తలదాచుకుంటున్నారు. ఇక్కడ పోలీసు సబ్ కంట్రోల్ గది అవసరం.

చెత్త నిండి, కంపుమయం

ఇది పంజాబ్ కూడలిలోని పోలీసు సబ్ కంట్రోల్ గది. గది నిండా పనికి రాని చెత్త, విరిగిన కుర్చీలతో నిండిపోయి ఉంది. మెట్లు సైతం శిథిలమయ్యాయి. గదిముందు ఏర్పడ్డ గుంతలో వర్షపు నీరు నిలిచి దోమలు, ఈగలకు ఆవాసంగా మారింది. అక్కడంతా కంపు కొడుతోంది. ఈ గదిలో కొద్దిసేపు కూడా కూర్చోవడానికి సైతం వీల్లేని విధంగా ఉంది.

పాడైపోయిన కూరగాయల అడ్డాగా..

ఇందులో కూరగాయల చెత్త ఎక్కడబడితే వేశారు. విద్యుత్తు సరఫరా కోసం ఏర్పాటు చేసిన మీటరు, బోర్డులపై వర్షం నీటితో తడిసిపోయి ఉన్నాయి. గోడలకు సైతం విద్యుత్తు ప్రవహించి ప్రమాదకరంగా మారే అవకాశాలున్నాయి. గది ఎదుటే కూరగాయల వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేశారు.

# మారని కథ.. అమ్మకు వెత



మంచిర్యాల : ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా కోతలు తగ్గించాలని ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి జిల్లాలో చెబుతున్నారు. ఈ ఏడాది మార్చిలో జిల్లాకు వచ్చిన సందర్భంలోనూ చెప్పారు. దీనికి తోడు జిల్లా వైద్యారోగ్యశాఖ నెలకోసారి ప్రసూతి వైద్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తూ శస్త్రచికిత్సలు తగ్గించాలని సూచిస్తోంది. అయినా ఏమార్పు కనిపించడంలేదు. వీటి సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఇటీవల సర్కారులోనూ కోతలకే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. కాకపోతే ప్రైవేటుతో పోల్చితే (స్టాఫ్‌నర్సుల కృషితో) కాస్త మెరుగ్గానే సాధారణ ప్రసవాలు చేస్తుండటం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రులైతే పోటీ పడుతున్నట్లే వ్యవహరిస్తున్నాయి. విచ్చలవిడిగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. జిల్లా వైద్యాధికారి సూచనలను ఏ మాత్రం పట్టించుకుంటున్నట్లు కనిపించడంలేదు. ఇలా విని అలా వదిలేస్తున్నట్లే అనిపిస్తోంది. వీరికి తగ్గట్లుగా ప్రైవేటుపై వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరవైంది.

'ప్రభుత్వం'లో కాస్త నయం...గతంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో శస్త్రచికిత్సల కంటే సాధారణ ప్రసవాలే ఎక్కువగా జరిగేవి. ప్రస్తుతం వీటి సంఖ్య సమాన స్థాయికి చేరింది. భవిష్యత్తులో వీరు కూడా ప్రైవేటు బాటపట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఇక ప్రైవేటు సంగతి చూస్తే.. వామ్మో అనాల్సిందే. వీటితో చూస్తే సర్కారులోనే కాస్త నయమనిపిస్తోంది. ఇక్కడ జరిగే ప్రసవాల్లో కాస్త అటుఇటుగా(శస్త్రచికిత్స, సాధారణ) సామానంగా చేస్తుండగా ప్రైవేటులో సాధారణ ప్రసవాలు రెండు అంకెలు దాటడం లేదు. 95 శాతానికి పైగా కోతలతోనే చేస్తున్నారు. గత నాలుగునెలల్లో ప్రభుత్వ, ప్రైవేటులో జరిగిన ప్రసవాల సంఖ్య దగ్గరగా ఉండగా.. సాధారణ ప్రసవాలు చేయడంలో మాత్రం చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. సర్కారులో 50శాతం జరగగా, ప్రైవేటులో కేవలం ఆరు శాతమే నిర్వహించారు.

ఓపికలేకా..? డబ్బులు తక్కువనా?

సాధారణ ప్రసవాలు చేసేందుకు ప్రైవేటు ప్రసూతి వైద్యులు ఎందుకు మొగ్గు చూపడం లేదో అర్థం కాకుండా ఉంది. వైద్యులకు వేచిఉండటం ఇష్టం లేదో.. బాధితులు డబ్బులు తక్కువగా ఇస్తారనే సందేహమో గానీ గర్భిణులు ప్రైవేటుకు వచ్చారంటే కోతలేందే ప్రసవం చేయడం లేదు. అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశంలోనే సాధారణ ప్రసవం చేసేందుకు అక్కడి వైద్యులు గంటల తరబడి వేచిచూస్తారు. కానీ ఇక్కడి వైద్యులు నిమిషం కూడా ఉండే పరిస్థితి లేదు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఎలాగూ ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేయదు.. శస్త్రచికిత్సలపై ఆరా తీయదు.. కనీసం ఈ ధరల విషయంలోనైనా చొరవ తీసుకుంటే ప్రజలకు కాస్త ఊరట కలిగించినట్లు అవుతుంది.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించాం- డా.సుబ్బారాయుడు, జిల్లా వైద్యాధికారి

సాధారణ ప్రసవాలు పెంచాలని పదేపదే సమావేశాలు ఏర్పాటు చేస్తూ హెచ్చరిస్తూనే ఉన్నాం. శస్త్రచికిత్సల కొరకే వస్తున్నారని ప్రైవేటుకు సమాధానం ఇస్తున్నాం. ఇటీవల కూడా సమీక్ష నిర్వహించి లెక్కలు వివరించాం. వచ్చే నెల వరకు మార్పులు రాకపోతే ఆడిట్ చేస్తామని తెలిపాం. సాధారణ ప్రసవాలు పెంచేందుకు కృషి చేస్తున్నాము.

# కల్యాణలక్ష్మి అక్రమాల్లో రూ.17 లక్షలు రికవరీ

ఆసిఫాబాద్ : జిల్లాలో కల్యాణలక్ష్మి అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకే పేరుతో అయిదుసార్లు కల్యాణలక్ష్మి డబ్బులు పొందారు. మరో మహిళ పేరుతో మూడుసార్లు ప్రభుత్వ సాయం రూ.1.16 లక్షల చొప్పున కాజేశారు. వారిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కావడం గమనార్హం. కెరమెరి మండల కేంద్రంగా అక్రమాలు జరిగిన తీరుపైలో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆధారాలతో సహా వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. వీటికి స్పందించిన పాలనాధికారి రాహుల్‌రాజ్ డీఆర్ఓ సురేష్‌ను విచారణ అధికారిగా నియమించగా.. మే 27 నుంచి అక్రమాలపై ఆరా తీస్తున్నారు. మొత్తం రూ.32 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారుల వివరాలను నకిలీవిగా గుర్తించారు. ఇందుకు బాధ్యులైన ముగ్గురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లుగా డీఆర్ఓ సురేష్ పేర్కొన్నారు.

కరోనా, లాక్‌డౌన్ సమయంలో 2020-21 సంవత్సరంలో కెరమెరితోపాటు వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాణి, సిర్పూర్(యు), లింగాపూర్, జైనూర్ మండలాల పరిధిలో మొత్తం 32 మంది నకిలీ ధ్రువపత్రాల ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ముగ్గురు వ్యక్తులు రూ.37.16 లక్షలు కాజేశారు. అసలైన లబ్ధిదారులకు విషయం తెలియడంతో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. అందులో కెరమెరికి చెందిన రాథోడ్ గోపీనాథ్, ఆడే నాందేవ్, సుర్దాపూర్‌కు చెందిన ఆడే అశోక్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు వీరి వద్ద నుంచి రూ.17 లక్షలు రికవరీ చేయగా.. మిగతా డబ్బులు అయిదారు రోజుల్లో రికవరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కెరమెరికి చెందిన రాథోడ్ బూరాబాయి 2021 సంవత్సరంలో మూడుసార్లు కల్యాణలక్ష్మి డబ్బులు తీసుకున్నట్లుగా అధికారులు విచారణలో తేలింది. రాథోడ్ నాగిన్‌బాయి ఏకంగా అయిదుసార్లు కల్యాణలక్ష్మి తీసుకున్నట్లు అధికారులు తేల్చారు.

## 'రెక్కలు' విప్పిన విమానయానం

హైదరాబాద్ : సులువుగా, తక్కువ సమయంలో, సురక్షితంగా గమ్యస్థానం చేరుకునేందుకు ప్రయాణికులు విమానయానాన్ని ఆశ్రయిస్తున్నారు. కొవిడ్ మహమ్మారి కారణంగా అంతర్జాతీయ ఆంక్షలతో విమానయాన రంగం తీవ్ర ఒడుదొడుకులకు లోనైంది. కొన్ని నెలలుగా ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనను అందిపుచ్చుకుని మళ్లీ పూర్వ స్థితికి చేరుకుంది. అటు దేశీయ సర్వీసులకు డిమాండ్ పెరగడం.. ఇటు అంతర్జాతీయంగా ఆంక్షలు ఎత్తివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రాకపోకలు బాగా పెరిగాయి.

ఒకే రోజు 53వేల మంది రాకపోకలు.. మే 15న దేశీయ ప్రయాణికుల



సంఖ్య 53 వేలు దాటింది. ఆరోజు 401 విమానాలు రాకపోకలు సాగించాయి. ఇది కొవిడ్ ముందు రోజువారీ సగటుతో పొల్చితే 103 శాతం అధికమని విమానాశ్రయ ప్రతినిధులు చెప్పారు. కొవిడ్‌కు ముందు రోజూవారీ సగటు ప్రయాణికుల సంఖ్య 51 వేల వరకు ఉండేది. ఎక్కువగా దిల్లీ, గోవాకు డిమాండ్ ఉంటోంది. ఈ నెల 10న అంతర్జాతీయ ప్రయాణికులు పది వేల మంది రాకపోకలు సాగించారు. కరోనా ప్రబలిన రెండున్నరేళ్లలో ఒకరోజు ప్రయాణించిన వారి సంఖ్య ఇదే అత్యధికం కావడం విశేషం.

దేశంలోనే అత్యధిక రికవరీ రేటు

ప్రదీప్ ఫణికర్, ఎయిర్‌పోర్టు సీఈవో

దేశంలోని ఇతర విమానాశ్రయాల కంటే శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణికుల పరంగా అత్యధిక రికవరీ రేటు సాధించింది.త్వరలోనే కొవిడ్‌కు ముందున్న స్థితికి చేరుకుంటామన్న నమ్మకం ఉంది. ప్రయాణికుల సంఖ్య, అవసరాలకు అనుగుణంగా టెర్మినల్ విస్తరణ పూర్తయింది. త్వరలో తూర్పుభాగాన్ని అందుబాటులోకి తెస్తాం.

## పోచారంలో స్వగృహ ఇళ్లు కొనండి

హైదరాబాద్ : హెచ్ఎండీఏ అధికారులు ఓ వైపు పోచారం, బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ ఇళ్లకు లాటరీ తీస్తున్నారు. మరోవైపు ఇళ్లు కొనేందుకు పేర్లు ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్.. ఉద్యోగులను ఆదేశించారు. దీనిపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. బహిరంగ నోటిఫికేషన్ ద్వారా పౌరుల నుంచి హెచ్ఎండీఏ వేలాదిగా దరఖాస్తులు స్వీకరించింది. మరోవైపు ఇళ్లు కొనేందుకు ముందుకురావాలని బల్దియా ఉన్నతాధికారులు యంత్రాంగాన్ని ఆదేశిస్తున్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల ద్వంద్వ వైఖరిపై దరఖాస్తుదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోటెత్తిన దరఖాస్తులు

రాజీవ్ స్వగృహ సద్భావన పేరుతో 2010లో ఘట్‌కేసర్ మండలం పరిధిలోని పోచారంలో, ఉప్పల్ మండలంలోని నాగోల్‌లో అప్పటి ప్రభుత్వం బహుళ అంతస్తుల సముదాయాలను నిర్మించింది. వేర్వేరు కారణాలతో నిర్మాణాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వాటికి రంగులద్ది నిర్ణీత ధరతో ప్రజలకు విక్రయించాలని ఇటీవల ప్రభుత్వం



నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హెచ్ఎండీఏ మే మొదటివారంలో ఇళ్ల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చంటూ బహిరంగ ప్రకటన చేసింది. మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు వస్తున్నందన.. పౌరులు పెద్దఎత్తున ఒక్కో దరఖాస్తుకు రూ.1000 చెల్లించి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ముందుకొచ్చారు. బండ్లగూడ, పోచారంలలోని మొత్తం 1971 ఫ్లాట్లకు 39 వేల మంది దరఖాస్తు చేశారు. లబ్ధిదారుల ఎంపిక కోసం సోమవారమే హెచ్ఎండీఏ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సంయుక్తంగా బహిరంగ లాటరీ విధానాన్ని ప్రారంభించాయి. దాదాపు అన్ని ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది.

ఎవరైనా తీసుకోకపోతే..

"లాటరీ పద్ధతిలో ఇళ్లు దక్కించుకున్న వ్యక్తుల్లో పలువురు కొనుగోలుకు ఆసక్తి చూపరు. అప్పుడు ఇళ్లు మిగులుతాయి. అలా కాకుండా ఉండేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారి ఉద్యోగులను సిద్ధం చేయాలని పది రోజుల కిందట జీహెచ్ఎంసీని ఆదేశించారు. ఆమేరకు బల్దియా ఉద్యోగుల అభిప్రాయం కోరింది. ఐదుగురు ఆసక్తి చూపారు. వాళ్ల పేర్లను జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి పంపింది. కేవలం ఐదుగురి పేర్లు ఇవ్వడమేంటని ప్రభుత్వ ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం.. విభాగాధిపతులంతా ఇళ్లు కొనేలా ఉద్యోగులను ప్రోత్సహించాలని జీహెచ్ఎంసీ అన్ని విభాగాలకు సర్క్యులర్ పంపిందని" ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇళ్లు కొనాలటూ ఆధార్ కార్డుల వివరాలూ అడుగుతున్నారని పేర్కొన్నారు.

## రోగుల సహాయకులకు మూడు పూటలా భోజనం

హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఆస్పత్రులలో రోగుల సహాయకులకు, నగరంలోని పేదలకు కడుపునిండా నాణ్యమైన, రుచికర భోజనం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. నార్సింగిలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ వారి అక్షయపాత్ర వంటశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక వంటశాలను మంత్రి సోమవారం ప్రారంభించారు. వటం రమేశ్‌బాబు, ప్రదీప్ గోపాల్ అగర్వాల్ కుటుంబాలు ఈ వంటశాల ఏర్పాటుకు రూ.2.5కోట్లు సమకూర్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో 18 ఆస్పత్రులలో రోగుల సహాయకులకు భోజనం అందించేందుకు ఈ ఆధునిక వంటశాల తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డి, నార్సింగి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రేఖ, వైస్ ఛైర్మన్ వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ సత్యబాబు పాల్గొన్నారు.

# వానాకాలం సాగుకు ప్రణాళిక సిద్ధం

వరంగల్ :హనుమకొండ జిల్లాలో వ్యవసాయ అధికారులు వానాకాలం సాగుకు సన్నద్ధం అవుతున్నారు. సీజన్‌కు ముందే ప్రణాళిక సిద్ధం చేసుకొని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పలు పంటల సాగు సరళిలో మార్పులు తీసుక రావాలని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా రైతులను చైతన్య పరిచేందుకు సదస్సులు నిర్వహించనున్నారు. రానున్న సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పెంచాలని, పత్తి సాగు తగ్గించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. నూనె గింజలు, పప్పుధాన్యాల పంటల సాగు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించేందుకు క్లస్టర్ల వారీగా ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యవసాయ విస్తరణాధికారులతో పాటు మండల, డివిజన్ అధికారులకు దీనిపై లక్ష్యాలు నిర్దేశించారు. నకిలీ విత్తనాలు అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలను సమాయత్తం చేస్తున్నారు.

పెరుగనున్న ప్రధాన పంటల సాగు....

జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలు కాగా.. వానాకాలం 2.42 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని భావిస్తున్నారు. దీనిలో అత్యధికంగా 1.50 లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరిలో కూడా 60 శాతం సన్నరకం వేసేలా రైతులను చైతన్యపరచాలని నిర్ణయించారు. మార్కెట్‌లో పత్తి, కంది, మొక్కజొన్నకు ధరలు బాగుండటంతో వీటి సాగు విస్తీర్ణం పెరగొచ్చని భావిస్తున్నారు. పత్తి గతేడాది 87,100 ఎకరాల్లో సాగు చేయగా దిగుబడి తగ్గడంతో.. ఈసారి 85 వేల ఎకరాల్లో సాగు కావచ్చని అంచనా వేస్తున్నారు. మొక్కజొన్న పంట సాగు పరిస్థితి అంతే. ప్రభుత్వం విత్తనాలపై రాయితీ రద్దు చేయడంతో వరి, పత్తి, కంది, మిరప వంటి వాటిని ప్రైవేటు కంపెనీల పైనే ఆధారపడాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం మేరకు కంపెనీలు ఏయే విత్తన రకాలు నిల్వ చేసుకున్నాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

# మార్కెట్ అడ్డాలు అమ్ముకున్నారు!

వరంగల్ : వరంగల్ ఎనుమాముల మార్కెట్ పరిధిలోని లక్ష్మీపురం నూతన కూరగాయల మార్కెట్‌ను రూ.6 కోట్లతో నిర్మించి గతేడాది మార్చిలో ప్రారంభించారు. ప్లాట్‌ఫాంలు, అడ్డాల కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగాయి. ఒక్కొక్కరి నుంచి రూ.వేల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానిక నాయకులు, దళారులు సూచించిన వారికే అధికారులు అడ్డాలను కేటాయించడంతో అర్హులైన వారికి అవకాశం దక్కలేదు. అలాంటి చిరు వ్యాపారులు పాత మార్కెట్ ప్రాంతంలో రోడ్డుపైనే అడ్డాలు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయిస్తున్నారు.

అసలు సూత్రధారులెవరు..?

పాత మార్కెట్ నుంచి కొత్త మార్కెట్‌కు దుకాణాలను తరలించే సమయంలో వ్యాపారులకు పారదర్శకంగా అడ్డాలను కేటాయించాలని టోకెన్ విధానం ప్రవేశపెట్టారు. గతంలో జారీచేసిన లైసెన్సుల ఆధారంగా కొందరికి టోకెన్లు ఇచ్చారు. ఇదే అదనుగా దళారులు డబ్బులు చెల్లించిన వారికే అడ్డాలు కేటాయిస్తామని ప్రచారం చేసి వారి నుంచి అందినకాడికి దండుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా అధికారులకు వాటా అందినట్లు తెలుస్తోంది. ఓ పొరుగుసేవల ఉద్యోగిని ముందుంచి మార్కెట్ అధికారి, కొంతమంది బడా నాయకులు, పాలకవర్గం సభ్యులు చక్రం తిప్పినట్లు వినికిడి. కొత్త మార్కెట్‌లో వ్యాపారమంటే తెలియని వారు అడ్డాలు, షాపులు పొంది నెలసరి అద్దెతో బినామీలకు కొందరు అప్పగించగా, మరికొందరు వ్యాపారం చేయకపోవడంతో కవర్‌షెడ్డులోని చాలా ప్లాట్‌ఫాంలు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. మార్కెట్‌లోని 92 కమిషన్ దుకాణాల కేటాయింపుల్లోనూ రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది. వాటిలో ఓ పార్టీకి చెందిన కార్పొరేటర్ ఒక్కరికే మూడు దుకాణాలు ఉన్నట్లు సమాచారం.

అనధికారికంగా అద్దె వసూళ్లు

ఏడాది కాలంగా మార్కెట్ కవర్‌షెడ్డులోని 158 ప్లాట్‌ఫాంలు, ఖాళీ ప్రదేశంలో కూరగాయలు విక్రయించే సుమారు 300 మంది వ్యాపారుల నుంచి అద్దెలు వసూలు చేయడంలో మార్కెట్ సిబ్బంది ఉదాసీనత చూపిస్తున్నారు. అద్దె ఖరారు చేసి ఏడాది గడుస్తున్నా.. వారి నుంచి వసూలు చేయడంలో వెనకడుగు వేస్తున్నారు. 158 ప్లాట్‌ఫాంలలో ఒక్కొక్క దానికి రూ.2,300 నిర్ధారించగా, ఏడాదికి రూ.43,60,800, ఖాళీ ప్రదేశంలో గీసిన డబ్బాల్లో కూర్చుని విక్రయించే సుమారు 300 మందికి ఒక్కొక్కరికి కేటాయించిన స్థలం (అడ్డా) విస్తీర్ణం ఆధారంగా నెలకు రూ.800, రూ.600, రూ.400 అద్దెను నిర్ణయించగా.. ఏడాదికి రూ.30లక్షల వరకు చిల్లర వర్తకులు చెల్లించాల్సి ఉంది. అందులో కొందరు మాత్రమే అరకొర అద్దెలు చెల్లిస్తున్నారు. 82 మంది కమిషన్ వ్యాపారుల నుంచి పూర్తిస్థాయిలో మార్కెట్ ఫీజు వసూలు చేసే విషయంలోనూ నిర్లక్ష్యం వహించడంతో ఇప్పటివరకు సుమారు రూ.20లక్షల మేర మార్కెట్ ఆదాయానికి గండిపడింది. అద్దెల విషయంలో మార్కెట్ ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది వ్యాపారుల నుంచి ప్రతినెలా అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నట్లు తెలుస్తోంది.

బాధితుల్లో కొందరు... ఖిలావరంగల్‌కు చెందిన బొల్లం రాధిక దివ్యాంగురాలు. 15 ఏళ్ల నుంచి మార్కెట్‌లో కొత్తిమీర, ఆకుకూరలను విక్రయిస్తున్నారు. లైసెన్సు ఉంది. నూతన మార్కెట్‌లో అడ్డా కేటాయిస్తామని ఓ వ్యక్తి రూ.20 వేలు వసూలు చేశాడు. ఇప్పటికీ అడ్డా చూపించలేదు. గేటు వద్ద వేరే వారిని బతిమిలాడి కొంత స్థలంలో ఆకుకూరలను విక్రయిస్తున్నారు. వరంగల్ శివనగర్‌కు చెందిన వన్నాల రమ గతంలో ఓ కమిషన్ వ్యాపారి దుకాణం ముందు కూరగాయలు విక్రయించేవారు. నూతన మార్కెట్‌లో ప్లాట్‌ఫాం కేటాయింపునకు పెండింగ్‌లో ఉన్న అద్దె చెల్లించాలని ఆదేశించడంతో రూ.60 వేలు చెల్లించారు. అందుకు సంబంధించిన రసీదు ఇప్పటికీ ఇవ్వలేదు. మార్కెట్ అధికారులతో సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి ఖిలా వరంగల్‌కు చెందిన కొప్పుల రాజు నుంచి మార్కెట్‌లో స్థలం కేటాయించేందుకు రూ.1.20 లక్షలు వసూలు చేశాడు. జాబితాలో పేరు లేకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరారు. ఆ వ్యక్తి జాప్యం చేస్తుండగా విషయాన్ని పోలీసులు, మీడియా దృష్టికి తీసుకెళ్తాననడంతో.. ఇటీవల తిరిగి చెల్లించాడు.అడ్డా చూపించేందుకు రూ.50 వేలు అడిగారు

–బండారి లావణ్య, ఖిలావరంగల్

14 ఏళ్ల నుంచి మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్నాను. మార్కెట్ లైసెన్సు ఉంది. అద్దె, రెన్యువల్ ఫీజులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా. కొత్త మార్కెట్‌లో అడ్డా కేటాయింపునకు మార్కెట్ సూపర్‌వైజర్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. అంత స్తోమత తనకు లేదని బతిమిలాడినా కనికరించలేదు.నేరుగా ఫిర్యాదు చేయాలి–బి.వి.రాహుల్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కొత్త మార్కెట్‌లో వసూళ్లకు పాల్పడిన అంశం మా దృష్టికి రాలేదు. బాధితులు నేరుగా ఫిర్యాదు చేయాలి. ఖాళీ ప్లాట్‌ఫాంలకు సంబంధించి వ్యాపారులకు నోటీసులు జారీచేశాం. విక్రయాలు జరగని వాటిని గుర్తించి అర్హులకు కేటాయిస్తాం.

# పరిమితికి మించి గ్రానైట్ తరలింపు..!!



మహబూబాబాద్ : గ్రానైట్ రాయితో కనిపిస్తున్న ఈ లారీ ఇనుగుర్తి మండలంలోని క్వారీ నుంచి ఖమ్మంలోని పరిశ్రమకు తీసుకెళ్తున్నారు. నిబంధనల ప్రకారం 50 నుంచి 55 టన్నుల రాయిని తరలించాలి. అదనంగా 10 టన్నులు తరలిస్తున్నారు.. తీసుకెళ్లే రాళు నిర్దిష్టమైన ఆకారంలో లేవు. కింద పడకుండా ఎలాంటి తాళ్లు కట్టలేదు. ఇలా ప్రమాదకరంగా.. నిబంధనలకు వ్యతిరేకంగా రాళ్లను తీసుకెళ్తున్న ఐదు లారీలను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు కురవిలోని 365వ జాతీయ రహదారిపై శనివారం పట్టుకున్నారు. వాటిలో మూడు లారీల్లోనే అధిక లోడ్‌తో గ్రానైట్‌ను తరలిస్తున్నట్లు గుర్తించి ఆ వాహనాలను కురవి ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం వాటిపై చర్యలు తీసుకునేందుకు మైనింగ్, రవాణాశాఖ అధికారులకు అప్పగించామన్నారు. ప్రమాదకరంగా, అధిక లోడ్‌తో తరలిస్తున్న వాహనాలను పట్టుకుని చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతుందని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మైనింగ్, రవాణా శాఖ అధికారులు నిర్ధారిస్తేనే గ్రానైట్ క్వారీల నిర్వాహకులు వ్యవహారం బయటపడనుంది.

గ్రానైట్ రాయి నిక్షేపాలకు పేరున్న జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు పరిమితికి మించి అధికలోడ్‌తో గ్రానైట్ రాయి తరలింపుపై గనులు, భూగర్భశాఖ, రవాణాశాఖ అదికారుల పట్టింపు కరవైంది. తనిఖీలు చేస్తూ చర్యలు తీసుకోవడం నామమాత్రంగా మారింది. ఈ రెండు శాఖల ఉదాసీన వైఖరిని ఆసరా చేసుకుంటున్న క్వారీల నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా రవాణా కొనసాగిస్తున్నారు. ఫలితంగా అధిక లోడ్‌తో బండ రాళ్లను తరలిస్తున్న లారీలు పలుమార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. 2022 డిసెంబరు 31 రోజున కేసముద్రంలోని ఓ క్వారీ నుంచి ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమకు బండ రాళ్లను నిబంధనల కంటే 10 టన్నులు అధికంగా తీసుకెళ్తున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో కురవిలోని 365వ జాతీయ రహదారిపై ఎనిమిది మందితో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా..ఐదుగురు గాయపడ్డారు. రాళ్ల దాటికి రహదారి దెబ్బతింది. గత నెలలో తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ శివారులో గ్రానైట్ లారీ ఢీకొన్ని ఖమ్మం చెందిన ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే మృతి చెందారు.

జిల్లాలో ఇలా

జిల్లాలో 167 బ్లాక్, కలర్ గ్రానైట్ క్వారీలున్నాయి. ఇందులో 53 క్వారీల్లో గ్రానైట్‌ను తీస్తున్నారు. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, తొర్రూరు, గూడూరు మండలాల్లో ఉన్నాయి. వీటి నుంచి అధికంగా ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఆర్డర్ల ఆధారంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లారీ సామర్థ్యాన్ని బట్టి 45 నుంచి 55 టన్నులు, ట్రాక్టర్‌లో 5 టన్నుల రాయిని తరలించేందుకు గనులు, భూగర్భశాఖాధికారులు అనుమతి ఇస్తున్నారు.

ఇష్టారాజ్యంగా తరలింపు

అధిక లోడ్‌తోపాటు ఒక నిర్దిష్టమైన ఆకారంలో గ్రానైట్‌ను తరలించడం లేదు. క్వారీల నుంచి పరిశ్రమలకు తరలించే సమయంలో రాళ్ల ఎత్తుపల్లాలు సరిగా ఉండేలా కటింగ్ చేసి పంపించాలి. నిర్వాహకులు అలాంటి నిబంధనలేమి పాటించడం లేదు. ఎవరూ పట్టించుకోరని రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. సామర్థ్యాన్ని మించి రవాణా చేయడం వల్ల ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. రహదారులు దెబ్బతింటున్నాయి. డోర్నకల్, మరిపెడ, నర్సింహులపేట తొర్రూరు, కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు ప్రాంతల్లో ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయి. రహదారులు దెబ్బతింటున్నాయని కొన్ని గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలున్నా పరిస్థితిలో మార్పు రావడ లేదు.నిబంధనలు పాటించని వారిపై చర్యలు– రమేశ్‌రాథోడ్, ఎంవీఐ, మహబూబాబాద్‌క్వారీల నిర్వాహకులు రాయిని తరలింపులో నిబంధనలను పాటించాలి. కురవిలో పోలీసులు పట్టుకున్న లారీలను ఖమ్మంలోని వే బ్రిడ్జిపై తూకం వేయిస్తాం. అధిక లోడ్‌తో తరలిస్తున్న వాటిపై చర్యలు తీసుకుంటాం.

# పాలకా.. ప్రజా సేవకేది తీరిక!




భూపాలపల్లి : కార్పొరేటర్ అంటే డివిజన్ ప్రథమ పౌరుడు. ప్రజాప్రతినిధిగా ఎదిగేందుకు ఈ పదవి మొదటి మెట్టు లాంటింది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర స్థానిక సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత వీరిదే. వీటన్నిం టినీ మరిచి వారు సొంత లాభం చూసుకుంటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు అమలు చేయకపోవడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు భూకబ్జాల కేసులో జైలుకెళ్లి వచ్చిన ఘటనలను ఉదాహరిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లపై తీవ్రమైన ఆరోపణ లున్నాయి. మహా నగర పాలక సంస్థ పాలకవర్గం ప్రమాణ స్వీకా రం చేసి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో వీరి పనితీరుపై పరిశీలన కథనం.

భర్తల పెత్తనం

గ్రేటర్‌లో 36 మంది మహిళా కార్పొరేటర్లు ఉన్నారు. రెండేళ్లవుతున్నా వీరిలో చాలా మంది ప్రజలతో మమేకం కాలేదు. షాడో కార్పొరేటర్లు పెత్తనం చెలాయిస్తున్నారు. కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తల ఆగడాలు శృతి మించుతున్నాయని పౌరులు వాపోతున్నారు. 10–15 మంది కార్పొరేటర్లు సంతకాలకే పరిమితమయ్యారని విమర్శలు వస్తున్నాయి.

కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా డివిజన్లలో కబ్జాలు, ఆక్రమణల్లో కొందరు కార్పొరేటర్లు బహిరంగంగానే కనిపిస్తున్నారు. వివాదాస్ప దమైన స్థలాల్లో తలదూర్చి సొంతం చేసుకుంటున్నారని, ప్రజాప్రతిని ధుల అండతో ఐదారుగురు కార్పొరేటర్లు పెద్ద పెద్ద దందాలు చేస్తున్నారనే ఆరోపణలొచ్చాయి. ప్రభుత్వ స్థలాలు, లేఅవుటు ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు ఆక్రమణకు పాల్పడ్డారంటున్నారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాలు, విలీన గ్రామాల్లో ప్రైవేటు పంచాయితీలు నిర్వహించి స్థలాలు సొంతం చేసుకోవడంపై వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో చాలా వరకు కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తల పేర్లు ఉండటం గమనార్హం.

ఐదారుగురే అందుబాటులో..

నగరంలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రజలకు దగ్గరగా 10–12 మంది కార్పొరేటర్లు ఉంటున్నారు. 20–25 మంది సొంత వ్యాపారాలు, పైరవీలు, పలుకుడి కోసం పాకులాడుతున్నారు. 15– 20 మంది కార్పొరేటర్లు డివిజన్లలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, కబ్జాల్లో మునిగి తేలుతున్నారు. మరికొంత మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చుట్టూ తిరుగుతున్నారు. ఐదారుగురు కార్పొరేటర్లే వీటికి దూరంగా ఉంటూ ప్రజలకు దగ్గరవుతున్నారు.

ఆదాయం కోసం తహతహ

కార్పొరేటర్‌గా గెలిచేందుకు రూ.కోట్లు ఖర్చు పెట్టామంటూ ఆదాయం కోసం తహతహలాడుతున్నారన్న విమర్శలున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని పౌరులు ఆరోపిస్తున్నారు. డబ్బులివ్వక పోతే పనులు ఆపిస్తున్నారని వాపోతున్నారు. డివిజన్లలో అభివృద్ధి పనులకు లెక్క గట్టి పర్సంటేజీలు వసూలు చేస్తున్నారు. కొందరు కార్పొరేటర్లు కొబ్బరి కాయ కొట్టగానే గుత్తేదార్లను పర్సంటేజీ అడుగుతున్నారని, దీంతో పలు డివిజన్లలో పనులు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొందరు కార్పొరేటర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల ద్వారా హోటళ్లు, అల్పాహార కేంద్రాలు, ఇతర వ్యాపార సంస్థల నుంచి డబ్బులు వసూలు చేయిస్తున్నారని తెలిసింది.

ఇవిగో ఉదాహరణలు హనుమకొండ నగరం నడిబొడ్డున ఇద్దరు కార్పొరేటర్ల కబ్జాల పర్వం ఎక్కువైంది. వారి డివిజన్లలోనే కాకుండా పక్క డివిజన్లలో వేలు పెడుతున్నారు. వీరికి తోడు మరో ఇద్దరు మాజీలు ఉన్నారు. కాలనీల్లో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కన్నేస్తున్నారు. కాజీపేటకు చెందిన మరో కార్పొరేటర్ విలీన గ్రామాల్లో స్థలాల సెటిల్‌మెంట్లలో తలదూర్చుతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. రాజకీయ అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్ల ఆక్రమణలు పెరిగాయి. చెరువు, కుంటలు, పాత పంచాయితీ స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.

వరంగల్ ప్రాంతంలోని విలీన గ్రామాల మహిళా కార్పొరేటర్ భర్త ఇటీవల మూడు, నాలుగు ప్లాట్లు బినామీ పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. కేసులు నమోదైనా తీరు మారడం లేదు.

వరంగల్‌లోని ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్లు లేఅవుటు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. ఓ కార్పొరేటర్ మంచినీటి బావినే పూడ్చేశారు. వరంగల్‌లో కోట్లాది విలువైన పాత లేఅవుటు ఖాళీ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్లకు కార్పొరేటర్ సహకారం అందించారు. ఓ కార్పొరేటర్ బిల్డర్ అవతారమెత్తారు. వివాదాస్పదమైన స్థలాలు సొంతం చేసుకొని భవన నిర్మాణాలు చేయిస్తున్నారు.

పాతబస్తీలో మహిళా కార్పొరేటర్ భర్తలు స్థలాల గొడవల్లో తలదూర్చారు. డివిజన్‌లో స్థలం కనిపిస్తే కొనేస్తున్నారు.

ఖమ్మం జాతీయ రహదారి పరిసరాల్లో అనధికార లేఅవుట్లకు ఓ కార్పొరేటర్ అండగా ఉంటున్నారు. లేఅవుట్ అనుమతులు వద్దని, ఫీజుల సొమ్ము నాకే ఇవ్వాలని స్థిరాస్తి వ్యాపారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు.

# పైన రంగులు.. లోన అసంపూర్తి పనులు

వేములవాడ : మధ్యమానేరు జలాశయంలో గ్రామం ముంపునకు గురికావడంతో సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారిన కోతులకాలనీ నిర్వాసితులకు ఇంకా రెండు పడక గదుల ఇళ్లు దరి చేరలేదు. వారికి ప్రభుత్వం పునరావాసం కింద ఇళ్లు మంజూరు చేసినప్పటికీ అవి అసంపూర్తిగా ఉండటంతో గుడారాల్లోనే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఎండ, వాన, చలిని భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. బయట మాత్రం రంగులు వేసి ఇళ్లు పూర్తి చేసినట్లు చెబుతుండటం గమనార్హం.

వేములవాడ మండలంలోని రుద్రవరం గ్రామ కోతులకాలనీలో దాదాపు 75 కుటుంబాలుండగా ఇందులో 40 కుటుంబాలకు చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ శివారులో ప్రభుత్వం ఇళ్ల ప్లాట్లు కేటాయించింది. అయిదేళ్ల క్రితం రూ. 2.20 కోట్లతో రెండు పడక గదుల నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ అవి నేటికీ అసంపూర్తిగానే ఉండటంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. బయటకు చూడటానికి రంగులు వేసి కనిపిస్తున్నప్పటికీ చాలా ఇళ్లకు మాత్రం తలుపులు, కిటికీలు అమర్చలేదు. కొందరు సొంత డబ్బులు పెట్టుకొని అమర్చుకోగా మరికొందరు కిటికీలకు అట్టలు, చీరలు అడ్డంగా పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా ఇళ్లలో తలుపులు, కిటికీలు, బాత్‌రూంల డోర్లు, ఫ్లోరింగ్ వంటి పనులు చేయాల్సి ఉంది. అసంపూర్తి పనులను పూర్తి చేయాలని నిర్వాసితులు పదేపదే అధికారులు, గుత్తేదారుకు మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం లేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వాటిని పూర్తి చేస్తే ఇళ్లలో నివాసం ఉండేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు, గుత్తేదారు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నీటి ట్యాంకు లేక కష్టాలుకోతులకాలనీలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల కాలనీలో నీటి వసతికి ట్యాంకు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుత్తేదారు నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. ఇళ్లు అసంపూర్తిగా ఉండటంతో వాటి ముందే గుడారాలు వేసుకొని నిర్వాసిత కుటుంబాలు అసౌకర్యాల మధ్య కాలం వెల్లదీస్తున్నాయి. నీటి ట్యాంకు లేక బోర్ల పైపులతో డ్రమ్ములు, డబ్బాల్లో నీళ్లు పట్టుకొని వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం వస్తే నీటికి నానా అవస్థలు పడుతున్నారు. నీరు సరిపోక బోరు నడిచినంత సేపు డ్రమ్ముల్లో నింపుకోవడానికి అందరు తిప్పలు పడుతున్నారు.

# నీరివ్వని భగీరథ

మేడిపల్లి : మండల కేంద్రాల్లో జరుగుతున్న సర్వసభ్య సమావేశాల్లో మిషన్ భగీరథ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోంది. ప్రతి సమావేశంలోనూ చర్చ జరుగుతుండటం అధికారులకు, ప్రజాప్రతినిధులకు వాగ్వాదం జరగడం సాధారణంగా మారింది. మేడిపల్లి మండలంలో రెండు సంవత్సరాలుగా మిషన్ భగీరథ అంశంపై చర్చ జరుగుతుండగా ఇటీవల వాగ్వాదం తారస్థాయికి చేరుకుంది. ఒక దశలో రాజీనామా చేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించే పరిస్థితి వచ్చింది. కొడిమ్యాల, మల్యాల, కథలాపూర్, కోరుట్ల, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల సమావేశాల్లోనూ తమ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, పైపులైన్లు పగిలి పోయాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలక సమావేశాల్లోనూ ఇదే అంశంపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలోనూ పలువురు శాసనసభ్యులు మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి.

లీకేజీలే ప్రధాన సమస్య

జిల్లాలోని సగం గ్రామాల్లో పైపులైన్ల నుంచి నీరు లీకేజీ కావడంతో సమస్యలు వస్తున్నాయి. ఇంట్రా పైపులైన్ వేసే గుత్తేదార్లు ఇప్పటికే పలుసార్లు మారడంతో సమన్వయ లోపం ఏర్పడింది. అధికారులు కూడా గుత్తేదార్లపై ఆగ్రహం వ్యక్తం చేసినా చాలా గ్రామాల్లో ఫలితం లేకుండా పోయింది. కాగితాలపై పూర్తి స్థాయిలో పైపులైన్ వేసినట్లు లెక్కలున్నా కొన్ని గ్రామాల్లో 50 శాతం పైపులైన్ కూడా వేయలేదని బీమారం మండలం వెంకట్రావుపేట సర్పంచి కాటిపల్లి జగన్ రెడ్డి పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గతంలోని బోర్‌వెల్స్ నుంచి నీటిని వినియోగిస్తే విద్యుత్తు బిల్లులు ప్రజలే చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని గోవిందారం సర్పంచి కరండ్ల మధుకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో నీటి సరఫరాలో ఇబ్బందులున్నా వీధి దీపాలు, మిషన్ భగీరథ కోసం నెలకు రూ.65,000 నుంచి రూ.1.20 లక్షల మేర బిల్లులు చెల్లించాల్సి వస్తోందని మల్యాల మండలం రామన్నపేట సర్పంచి గడ్డం జలజ తెలిపారు. తమ గ్రామంలో 1,300 గృహాలు ఉంటే సుమారు 450 ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్లు ఇచ్చారని, అలాంటప్పుడు నూరు శాతం నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు ఎలా అవుతుందని మల్యాల మండలం ముత్యంపేట సర్పంచి బద్దం తిరుపతి రెడ్డి ప్రశ్నించారు. రెండు మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయని, అడిగితే మోటార్లు కాలిపోయాయని అధికారులు చెబుతున్నారని పలువురు సర్పంచులు పేర్కొంటున్నారు. భగీరథ పుణ్యమాని పట్టణాలు, పల్లెల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నల్లాలు ఏర్పాటు చేసినా 90 శాతం నల్లాలు పని చేయవు.

పుణ్యక్షేత్రంలోనూ తిప్పలే!

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న సన్నిధిలోనూ నీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్ భగీరథ కింద కొండగట్టులో 5 లక్షల లీటర్ల సామర్థ్యం చొప్పున 2 ట్యాంకులు నిర్మించారు. 2 ట్యాంకులు కలిపి 10 లక్షల లీటర్ల సామర్థ్యమున్నా భక్తులకు సరిపడా నీరు అందడం లేదు. నిర్వహణలోనూ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. మిషన్ భగీరథ నీటిని వాడుకున్నందుకు ఆలయానికి నెలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

పథకం స్వరూపమిదీ..! మిషన్ భగీరథ పథకం కింద జగిత్యాల జిల్లాకు రెండు గ్రిడ్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగ్రహారం నుంచి జిల్లాలోని మేడిపల్లి, కథలాపూర్, మల్యాల, కొడిమ్యాల మండలాలకు మిగిలిన మండలాలకు ఇబ్రహీంపట్నం మండలం డబ్బా నుంచి నీరు వస్తోంది. డబ్బా నుంచి ప్రతిరోజూ 145 మిలియన్ లీటర్లు, ఆగ్రహారం నుంచి 120 మిలియన్ లీటర్లు నీటిని సరఫరా చేస్తున్నారు.భగీరథ కోసం జిల్లాలో 1,200 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం పూర్తి చేశారు. 2,400 కిలోమీటర్ల మేర ఇంట్రా(అంతర్గత) పైపులైన్ల నిర్మాణం పూర్తయింది.భగీరథ కింద కొత్తగా 380 ట్యాంకులు నిర్మించగా 520 పాత ట్యాంకులు కలిపి మొత్తం 900 ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది.జిల్లాలో మిషన్ భగీరథ కింద 2,25,000 నల్లాలు బిగించారు.

సిబ్బంది కొరతతో..: శేఖర్ రెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ

మిషన్ భగీరథ కింద ట్యాంకులకు నీరు సరఫరా చేయడం వరకే మా బాధ్యత. గ్రామాల్లో ఇంటింటికీ నీరు సరఫరా చేయడం స్థానిక ప్రజాప్రతినిధులే చూసుకోవాలి. చాలా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది లేకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. కొన్ని గ్రామాల్లో కనీసం వాల్వులు తెరిచే సిబ్బంది కూడా లేరు. మెట్‌పల్లి ప్రాంతంలో నాలుగైదు గ్రామాల్లో సమస్యలుంటే వాటిని కూడా పరిష్కరించాం. ప్రస్తుతానికి జిల్లాలో సమస్యలు తక్కువే ఉన్నాయి.

# పొదుపుగా తాగునీరు

కరీంనగర్ : కరీంనగర్ నగరవాసులకు ప్రతి రోజు తాగునీరు సరఫరా చేస్తుండగా.. ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు కుస్తీ పడాల్సి వస్తోంది.. వేసవి కావడంతో అవసరాలు పెరిగిపోగా ఆ మేరకు శుద్ధి నీటిని పంపిణీ చేసేందుకు కావాల్సిన రావాటర్ అందకపోవడంతో ఆలస్యమవుతోంది.. రెండు నెలలుగా డ్యాంలో నిల్వలు తగ్గడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. కొన్ని ప్రాంతాలకు ఫ్రెషర్‌తో సరఫరా అవుతుండగా, మరికొన్ని ప్రాంతాలకు సన్నగా వస్తుందని ఫిర్యాదులున్నాయి.

దిగువకు నీటి మట్టం

దిగువ మానేరు జలాశయమే ప్రధాన తాగునీటి వనరు. ఇందుల్లోంచి దిగువకు కాకతీయ కాల్వ ద్వారా వదులుతున్నారు. పది రోజులుగా 500–600 క్యూసెక్కులు కిందకు వదులుతున్నారు. వ్యవసాయ అవసరాలతోపాటు వరంగల్, ఖమ్మం ప్రాంతాలకూ ఇక్కడి నుంచే నీరు వెళ్తోంది. మిషన్ భగీరథతోపాటు పాత ఫిల్టర్‌బెడ్‌కు నేరుగా పైపులైను ద్వారా రావాల్సిన నీరు అందడం లేదు. పైపుల గుండా రాకపోవడంతో బూస్టర్ పంపుల ద్వారా పంపింగ్ చేసుకుంటున్నారు. రోజురోజుకు లెవల్స్ పడిపోవడంతో శుద్ధి జలం సరిపోవడం లేదు.

ఆటంకాలు లేకుండా పంపులు నడవాలంటే..

నగరానికి కావాల్సిన తాగునీటిని మానేరు డ్యాం నుంచి తీసుకుంటున్నారు. ప్రస్తుతం 8.218 టీఎంసీలే నిల్వ ఉండడంతో బూస్టర్ పంపులకు ఆశించిన స్థాయిలో చేరడం లేదు. ఆటంకాలు లేకుండా పంపులు నడవాలంటే 903 అడుగుల నీరు ఉండాలి. అంటే 11 టీఎంసీలు అవసరం. ఫిబ్రవరిలో 906.70 అడుగుల నీరుండగా 14 టీఎంసీలతో ఎలాంటి సమస్యలు రాలేదు. దిగువకు వదలడంతో నిల్వలు తగ్గాయి. కనీసం ఒక టీఎంసీ నిల్వ ఉంటే బూస్టర్లకు సక్రమంగా నీరందుతుంది. అప్పుడు శుద్ధి చేసుకోవడానికి అంతరాయం ఉండదు. మోటార్ల నిలిపివేత..శుద్ధి కేంద్రానికి రావాటర్ అందకపోవడంతో శుద్ధి చేసే నీరు సంపుల్లోకి రావడం లేదు. మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో ఒక మోటారును తరచూ నిలిపి వేస్తున్నారు. ఇక్కడ 370 హెచ్‌పీ మోటార్లు రెండు నడుస్తుండగా, మూడో 370 హెచ్‌పీ మోటారు ఉదయం 5 గంటలు కచ్చితంగా నడవాలి. గత కొన్ని రోజులుగా రెండు గంటలు మాత్రమే నడుస్తోంది. లోలెవల్ కోసం ఉన్న పాత ఫిల్టర్‌బెడ్ మాత్రం పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచి శుద్ధి నీరు మిషన్ భగీరథకు కూడా పంపిస్తున్నారు. వృథా తగ్గించి.. పొదుపు పాటించాలినగర పాలక సంస్థ ప్రతి రోజు 60 డివిజన్ల పరిధిలో తాగునీరు సరఫరా చేసేందుకు వెనుకడుగు వేయడం లేదు. ఆశించిన స్థాయిలో అందక పోవడంతో ఆలస్యంగా సరఫరా చేస్తున్నారు. అవసరమున్నంత మేరకు నీటిని నింపుకొని బిరడాల ద్వారా నిలిపి వేయాలి. మురుగునీటి కాల్వల్లో, బోరు, బావుల్లో వదలకూడదు. ట్యాంకులలో నిల్వ ఉంటే ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.

# మందగమనం

ఖమ్మం : మణుగూరు సమీపంలోని భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రవాణా చేసేందుకు చేపట్టిన రైలు మార్గం నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. 2021లో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు 30 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిజానికి రెండేళ్లలోనే రైలు మార్గం అందుబాటులోకి తేవాలి. జూన్ నుంచి వర్షాకాలం ప్రారంభం కానున్న తరుణంలో రెండు మూడు నెలలు పనులకు తీవ్ర అంతరాయం వాటిల్లుతుంది. బొగ్గు తరలింపునకు రోడ్డు రవాణాలో సమస్యలు ఎదురవుతున్న దృష్ట్యా రైలు మార్గం పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

సమస్య ఏంటి? జెన్కో సంస్థ నుంచి బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. పూర్తి స్థాయిలో భూసేకరణ కాలేదు. అక్కడ కొంత అక్కడ కొంత భూమిని సేకరించారు. ఆ ప్రాంతాల్లో పనులు చేపడుతున్నారు. నిరంతర పని పరిస్థితులు లేకపోవటంతో కార్మికులు స్వస్థలాలకు వెళ్లారు. దారిలో విద్యుత్తు స్తంభాలు, రహదారుల తొలగింపునకు అనుమతుల జాప్యం.

వేసవిలోనూ కురుస్తున్న వర్షాలతో మట్టి పనులు సాగటం లేదు.

ఇదీ నిర్మాణ తీరు

రైలు మార్గం పనులు బీటీపీఎస్ వెలుపల, లోపల రెండు భాగాలుగా చేస్తున్నారు. వెలుపల 18 కి.మీ. పొడవున గుత్తేదారుడు రూ.104 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు మణుగూరు మండలం కూనవరం రైల్వే గేట్ నుంచి ప్రారంభమై బీటీపీఎస్ వరకు కొనసాగు



తాయి. చెరువుముందుసింగారం, కాళీమాతా ఏరియా, పైలట్ కాలనీ, శేషగిరినగర్, విజయనగరం, రామానుజవరం, సాంబాయిగూడెం గ్రామాల మీదుగా రైలు మార్గం వెళ్తుంది. బీటీపీఎస్ లోపల మరో గుత్తేదారుడు రూ.20 కోట్లతో పనులు చేపట్టారు.

113 ఇళ్లను తొలగించాలి

రైలు మార్గం ఏర్పాటులో భాగంగా మణుగూరులో 113 ఇళ్లను తొలగించనున్నారు. ఇప్పటికే నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించారు. వారికి రామానుజవరం, ముత్యాలమ్మనగర్ గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జెన్కో రూ.14.5 కోట్లను ప్రభుత్వానికి చెల్లించింది. అయితే కిలోమీటరున్నర పొడవున ఇళ్లను నేలమట్టం చేసి భూమిని అప్పగిస్తేనే పనులు ముందుకు సాగుతాయి. మరో నాలుగు కిలోమీటర్ల భూమిని రెవెన్యూ శాఖ రైల్వే విభాగానికి అప్పగించాలి.

27 వంతెన పనులు ప్రారంభించాలి

బీటీపీఎస్ రైలు మార్గంలో మొత్తం 52 వంతెనలు ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు 17 పూర్తి చేశారు. మరో ఎనిమిది పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 27 వంతెనల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. భూమిని అప్పగించిన చోట కూడా గుత్తేదారుడు ఆశించిన స్థాయిలో పూర్తి చేయటం లేదు.రైలు మార్గం నిర్మాణానికి భూమిని పూర్తిగా అప్పగించకపోవటంతోనే ఆలస్యం అవుతున్నాయి. బిల్లులు చెల్లింపుల్లో జాప్యం లేదు. పనులు వేగంగా జరిగేలా చూస్తాం. బిచ్చన్న, సీఈ

# 'రసాయన శుద్ధి' అసంపూర్తి

ములుగు : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో కొలువైన రామప్ప ఆలయ రసాయన శుద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొద్ది నెలల క్రితం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆలయ గోపురంపై పేరుకుపోయిన పాకురును తొలగించి రసాయనాలతో శుద్ధి చేసే ప్రక్రియ ప్రారంభించారు. కాగా గత నెల పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. యునెస్కో గుర్తింపు పొందిన ఆలయ సంరక్షణ చర్యల్లో జాప్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పునఃప్రారంభమెప్పుడో?: రాతి కట్టడమైన రామప్ప ఆలయం గోపురం భాగంలో కూడా రాళ్లతో పేర్చితే ఎక్కువ కాలం నిలబడే ఆస్కారం ఉండదని గమనించిన కాకతీయులు తేలికపాటి (నీటిపై తేలియాడే) ఇటుకలను ఉపయోగించారు. ప్రత్యేకమైన ఇటుకలతో నిర్మించిన గోపురం ప్రతి ఒక్కరిని ఆకర్షించాయి. దాంతో సందర్శనకు వచ్చిన పర్యాటకులు వాటిని పరీక్షించడం మొదలు పెట్టారు. ఆలయ సహజత్వం పోతుందని, ఇటుకలకు రక్షణ కల్పించాలని పురావస్తుశాఖ అధికారులు ఆలోచన చేశారు. మూడు దశాబ్దాల క్రితం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గోపురాన్ని చక్కదిద్దారు. మరమ్మతుల అనంతరం పాలరాతి వలే అందంగా ఆకర్షించిన గోపుర భాగం సంవత్సరాలు గడిచే కొద్ది పాకురుపట్టి కళావిహీనంగా మారింది. దాంతో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రసాయనాలతో శుద్ధి చేయడం మొదలు పెట్టారు. గోపురానికి మూడు వైపులా పనులు పూర్తి కాగా పడమర వైపు మిగిలిపోయింది. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామప్పలో నిర్వహించిన ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని పనుల చేసేందుకు అమర్చిన కర్రలను తొలగించారు. మళ్లీ ఎప్పుడూ ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి.

ప్రక్రియ ఇలా..

రాతికట్టడమైన రామప్పును పదేళ్లకోసారి రసాయనాలతో శుద్ధి చేయడం కోసం పురావస్తుశాఖ చర్యలు చేపట్టింది. 2013లో మొదటిసారి శుద్ధి చేశారు. ఆ తర్వాత పదేళ్లు పూర్తయ్యే సరికి పాకురుపట్టి శిల్పకళా సంపద కొన్ని చోట్ల తేజస్సు కోల్పోయింది. శుద్ధి చేయడం కోసం మార్చి మొదటి వారంలో పనులు మొదలుపెట్టారు. మొదటగా ఆలయ గోపుర భాగంలోని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను నీటితో తడిపారు. ప్రత్యేక వస్తువులతో పాకురును తొలగించారు. ఆరిన తరువాత నీరుపడగానే జారిపోయే ఓ ప్రత్యేకమైన రసాయనాన్ని గోపురంపై చల్లగా అందంగా తయారైంది. ఇలా ఆలయానికి తూర్పు, ఉత్తరం, దక్షిణ దిశల్లో చేసి పడమరం వైపు పాకురు తొలగించి వదిలేశారు. ఇంకా ఆలయంలోని శిల్పాలను కూడా శుద్ధి చేయాల్సి ఉంది.

నిధుల విషయంలో గోప్యత..

సాధారణంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏ పనులు చేసినా నిధుల కేటాయింపును ప్రకటిస్తారు. అందుకు సంబంధించిన బోర్డులో పూర్తి వివరాలను తెలియజేస్తారు. కాని పురావస్తుశాఖ అందుకు విరుద్ధం. ఏళ్లు గడిచినా ఖర్చులు పెరిగాయంటూ మళ్లీ ప్రతిపాదనలు పంపి నిధులు పొందడం పరిపాటిగా మారింది. నిధుల విషయం గోప్యంగా ఉంచడానికి ఇదే కారణమన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పారదర్శకంగా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతు కష్టం.. రూ. కోట్ల నష్టం



ఖమ్మం : ఆశల పంట అడియాశలైంది. ఓ పక్క చేతికొచ్చిన దిగుబడులు కేంద్రాల్లో తడిసి ముద్దవుతుంటే.. ఇంకోపక్క వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న పంటలు గాలివానలకు నేలవాలాయి. రూ.లక్షలు అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవటంతో కర్షకుని హృదయం బరువెక్కుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంట కళ్లముందే వర్షపు నీటిలో కొట్టుకుపోతుంటే.. ప్రేక్షక పాత్ర పోషించక తప్పడం లేదు. కేంద్రాల్లో కొనుగోళ్లు మూడడుగులు ముందుకు ఏడడుగులు వెనక్కి చందంగా సాగుతుండగా ధాన్యపు రాశులపై అకాల వర్షం విరుచుకపడుతోంది. పంటను మిల్లుకు తరలించిన తర్వాతా కొర్రీలతో రైతు తెల్లబోతున్నాడు. ఇక మార్క్‌ఫెడ్ కేంద్రాల ఊసులేక దళారులను ఆశ్రయించి మొక్కజొన్న రైతు దగాపడుతున్నాడు. ఈ యాసంగిలో దారుణంగా నష్టపోయింది ఈ రైతులే. ముందెన్నడూ లేనిరీతిలో మార్చి 19న మొదలైన అకాల వర్షాలు, వడగళ్ల వానలు మే మొదటి వారంలోనూ కొనసాగాయి. ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కాలంలో ఉభయ జిల్లాల మొక్కజొన్న రైతులు సుమారు రూ.100 కోట్ల పంటను కోల్పోగా, వరి రైతులు రూ.42.41 కోట్ల మేర నష్టపోయారు. ఉద్యాన పంటల్లో ప్రధానమైన మామిడి, ఇతర పంటల్ని కూడా కలిపితే నష్ట తీవ్రత మరింత అధికంగా ఉంటుంది.

నష్టం ఇలా..మొక్కజొన్న.. ఈ పంట సాగుకు రైతులు ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడులు పెట్టారు. గతంతో పోలిస్తే చాలాచోట్ల ఈసారి దిగుబడి తగ్గిపోయింది. సగటున 20 క్వింటాళ్లు మాత్రమే సమకూరినట్టు అంచనా. ఉభయ జిల్లాల పరిధిలో మొక్కజొన్న రైతులు మొత్తం 25,603 ఎకరాల్లో పంట నష్టపోయారు. మద్దతు ధరల ప్రకారం ఈ పంట నష్టం విలువ రూ.98.31 కోట్లు. వారు నెలలపాటు చేసిన కాయకష్టం విలువ కలిపితే తీవ్రత మరింత పెరుగుతుంది.

వరి.. వరి సాగుకు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడులు పెట్టారు. ఈ యాసంగిలో సగటున 20 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా. అకాల వానలు, వడగళ్ల దెబ్బకు ఉభయ జిల్లాల పరిధిలో వరి రైతులు 10,397 ఎకరాల్లో పంట నష్టపోయారు. మద్దతు ధరల ప్రకారం రూ.42.41 కోట్ల నష్టం వచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉద్యాన పంటలూ ఎక్కువగా దెబ్బతిన్నాయి. మామిడి కాయలు పెద్ద మొత్తంలో రాలిపోయాయి. ఆ గణాంకాలూ వెలుగుచూస్తే నష్టం విలువ మరింత తీవ్రమవుతుంది.

# సమాజం లేనిదే మనం లేం.. మనలేం!



కొత్తగూడెం : కృష్ణయ్య సార్.. ఈ పేరు కొత్తగూడెం విద్యారంగం వారికి, ఇతర ప్రముఖులకు సుపరిచితమే. 1970లో శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడిగా వృత్తి ఆరంభించారు. ఎన్‌సీసీ అధికారిగానూ పుష్కర కాలంలో రాష్ట్రస్థాయి శిబిరాలెన్నో నిర్వహించి రికార్డు నమోదు చేశారు. గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, స్టడీ సర్కిల్, ఫిజికల్ డైరెక్టర్‌గా, అధ్యయనకర్తగా.. తాను పోషించిన ప్రతీ పాత్ర భావితరాల ఉజ్వల భవిత కోసమేనంటారాయన. 2002 తర్వాత మధిర డిగ్రీ కళాశాలకు వెళ్లారు. 2005లో ఉద్యోగ విరమణ తర్వాతా వృత్తికి దూరం కాలేదు. 2017 వరకు ఏపీలోని పూర్వ కృష్ణా జిల్లా, పాల్వంచలోని ప్రైవేటు విద్యా సంస్థలో ప్రధానాచార్యులుగా పనిచేశారు. నిత్యం విద్యార్థుల కోసం సమయం వెచ్చించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. సమాజానికి తనవంతు సేవ ఏనాడూ మరువలేదు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, ఇతర హోదాల్లో వరద బాధితులు, పేదలకు ఆర్థిక, వైద్య సహాయం అందించారు. ఆయన కృషికి గుర్తింపుగా వరించిన అవార్డులెన్నో.

ఆయనో విద్యా పిపాసి.. వృత్తిరీత్యా పదవీ విరమణ చేశారేగాని, తరగతి పాఠాలకు మాత్రం ఏనాడూ దూరం కాలేదు

ఆయనో చైతన్యశీలి.. సమాజ అజ్ఞానాంధకారాలను పారదోలేందుకు 'విజ్ఞాన వేదిక' ముందుకు కదిలారు.

ఆయనో మానవతావాది.. నిరాశ్రయులు, అభాగ్యులు తలదాచుకునే ఆశ్రయాలకు ఏటా పింఛనులోంచి వాటా ఇస్తారు

ఆయనో పర్యావరణ హితైషి.. మనకెంతో ఇచ్చిన ప్రకృతికి తిరిగి ఎంతోకొంత ఇచ్చేందుకు ఏదో విధంగా పరితపిస్తారు

ఆయనో ప్రకృతి వైద్యుడు.. మందులు మాన్పలేని గాయాలను తన మాటలతో, నేర్చిన వైద్యంతో నయం చేస్తారు

ఆరోగ్యమే మహాభాగ్యమని తలచే వారికి స్ఫూర్తి.. ఎన్నో జ్ఞాపకాలతో సంఘర్షణకు లోనయ్యే ముదిమి వయసు హృదయానికి 'నచ్చిన వ్యాపక'మే దివ్యౌషధమని చాటిన సిన్సియర్.. సీనియర్ సిటిజన్ డా.బత్తుల కృష్ణయ్య. ఆయన కామర్స్ విశ్రాంత ఆచార్యులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ వాసి.

అవార్డులు.. మరిచిపోలేని జ్ఞాపకాలుఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఎన్‌సీసీ అధికారిగా, వితరణశీలిగా.. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, పూర్వ గవర్నర్ కుముద్‌బెన్‌జోషి, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రుల చేతుల మీదుగా పదుల సంఖ్యలో అవార్డులు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. వెటరన్ అథ్లెట్‌గా రాణిస్తున్నారు. గతనెలలో సికింద్రాబాద్‌లో జరిగిన నాలు రాష్ట్రాల స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో రెండు కాంస్యాలు దక్కించుకున్నారు. ఇటీవల కాలంలో 5 కి.మీ. నడకలో 2 స్వర్ణ, ఒక రజత, 100 మీ.పరుగులో రజత పతకాలు సాధించారు.

సేవతోనే సంతృప్తి.. డా.కృష్ణయ్య

నా వయసు 76 ఏళ్లు. ఉదయాన్నే 4 గంటలకు నిద్రలేస్తా. వ్యాయామంతో పాటు నడక, పరుగు సాధన చేస్తా. ఈ అలవాటుతో ముదిమి వయసువారి ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. కుటుంబ విషయానికొస్తే.. మా పెద్దవాడు ఇండొనేషియాలో ప్రాజెక్టు మేనేజర్. చిన్నబ్బాయి విజయవాడలో విద్యుత్తు శాఖ ఉద్యోగి. సమాజానికి తోచిన సేవ చేస్తూ తీరిక లేకుండా ఉంటున్నా. సీనియర్ సిటిజన్లు ఇంటికే పరిమితం కావడం మానవ ధర్మం కాదు. మానసికంగా, శారీరకంగా కుంగిపోకుండా నలుగురితో కలిసిపోవాలి. తోచిన సేవ చేయాలి. వృత్తి నైపుణ్యాల్ని శిక్షణల్లో యువత, ఉద్యోగులకు నేర్పించాలి. 'సమాజం లేనిదే మనం లేం... మనలేం'. అంతా చెట్లు నాటాలి. భావితరాలకు మంచి బోధించాలి. మానవత, నైతికత, పుస్తక పఠనానికి దూరమవుతున్న యువతను సీనియర్ సిటిజన్లు సన్మార్గంలో నడిపించాలి.

సేవా కార్యక్రమాలే వ్యాపకం..

2018లో జీవిత భాగస్వామి సరోజ దూరమైన తర్వాత కుంగుబాటుకు లోనవకుండా సేవా కార్యక్రమాలు వ్యాపకంగా కొనసాగిస్తున్నారు. 'జన విజ్ఞాన వేదిక'లో సభ్యుడిగా చేరారు. స్వగ్రామమైన ఏపీలోని సత్తెనపల్లికి, గుంటూరు కళాశాల, పాఠశాలలకు నెలలో రెండుసార్లు వెళ్లొస్తున్నారు. విద్యార్థులకు మానవ సంబంధాలు, క్రమశిక్షణ, నైతికత విలువలు, జీవన నైపుణ్యాలు, వాణిజ్య శాస్త్రం సబ్జెక్టు బోధిస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల్లోనూ విలువల బోధనకు సమయం వెచ్చిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నారు. మూడేళ్లుగా విద్యార్థుల రవాణా ఛార్జీలకు ఏటా రూ.10 వేలు అందిస్తున్నారు. 'పేద పిల్లలకు ఉత్తమ విద్యే సరైన ఆస్తి' అని నమ్మారాయన. నిరాదరణకు గురైన వృద్ధులు, అసహాయులంటే చలించిపోతారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 వేల చొప్పున, దిల్లీలోని 'లోక్‌కల్యాణ్ సమితి', గుంటూరు చేతన ఛారిటబుల్ ట్రస్టుకు రెండు దశాబ్దాలుగా ఏటా రూ.10 వేలు పింఛను నగదు అందజేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధాశ్రమాలకు ఆర్థిక సాయం కొనసాగిస్తున్నారు. పేదలు, సీనియర్ సిటిజన్లకు ప్రకృతి వైద్యం చేసి, మందులను ఉచితంగా ఇస్తున్నారు.

# అభివృద్ధి పేరుతో లూటీ: తెదేపా

సత్తుపల్లి : అభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాధనాన్ని లూటీ చేస్తూ, ప్రజలను మోసగిస్తున్నారని తెదేపా జాతీయ క్రమశిక్షణ సంఘం సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు విమర్శించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లిలోని ఓ వేడుకల మందిరంలో ఖమ్మం పార్లమెంటరీ స్థాయి జిల్లా పరిశీలకుడు కూరపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన తెదేపా మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సభా ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి నివాళి అర్పించారు. బంటు మాట్లాడుతూ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నారని, తొలుత రూ.24వేల కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పి కమీషన్ల కోసం రూ.1.36 కోట్లకు పెంచారని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. సచివాలయాన్ని కూడా రూ.400కోట్లతో నిర్మిస్తున్నామని ప్రకటించి రూ.1600 కోట్లు ఖర్చు చేశారని, ఇది కేవలం కేసీఆర్ లబ్ధికోసమేనన్నారు. ఏపీలో చంద్రబాబుని సీఎం చేయనున్నారని, తెలంగాణలోనూ కాసాని జ్ఞానేశ్వర్ నాయకత్వంలో తెదేపాను అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఎన్టీఆర్‌కు భారత రత్న పురస్కారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రేడియాలజీ హబ్‌లో అత్యాధునిక వైద్య పరీక్షలు !

జనగామ : జిల్లా కేంద్రంలో వైద్యపరంగా పలు సేవలు మెరుగుపడుతున్నాయి. జనగామకు వైద్య కళాశాల మంజూరు కావడంతో జిల్లా ఆసుపత్రి బోధనాసుపత్రిగా మారడంతో పాటు ఎంసీహెచ్ ఆసుపత్రి సైతం వైద్య కళాశాల పరిధిలో పని చేయనుంది. ఈ ఏడాది జులై నుంచే మొదటి బ్యాచ్ ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నారు. ఇదే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాల్లో అత్యాధునిక వైద్య పరీక్షలను పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు రేడియాలజీ హబ్‌లు ఏర్పాటు చేస్తోంది. జనగామలో కూడా మున్సిపల్ కార్యాలయం పక్కనే రేడియాలజీ హబ్‌ను ఏర్పాటు చేశారు. 15 రోజుల క్రితం కొత్త భవనాన్ని నిర్మించారు.

పేదలకు అందుబాటులో..

రేడియాలజీ హబ్‌లో గుండె సంబంధిత సమస్యలు తెలుసుకునే టుడీ-ఎకో యంత్రం, కడుపు సంబంధిత స్కానింగ్ తీసే అబ్‌డామిన్ స్కానింగ్ యంత్రం, రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే మామోగ్రామ్, క్రియోథెరఫీ, కోల్పోస్కోపీ, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ యంత్రాలను ఏర్పాటు చేశారు. తొలుత మామోగ్రామ్, ఈసీజీ, డిజిటల్ ఎక్స్‌రే సేవలను ప్రారంభించారు. టుడీ-ఎకో సేవల కోసం కార్డియాలజిస్ట్ వైద్యుడు, యూఎస్ స్కానింగ్ సేవలకు గాను గైనకాలజీ వైద్యురాలు, రేడియాలజిస్ట్ వైద్యులను నియమించాల్సి ఉంది. ఆయా విభాగాల్లో వైద్యులు వస్తే స్కానింగ్, టుడీ-ఎకో సేవలు కూడా అందనున్నాయి. ఇప్పటి వరకు జిల్లా ప్రజలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఇతర పరీక్ష కేంద్రాల్లో



వేలాది రూపాయలు వెచ్చించి ఈ పరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు రేడియాలజీ హబ్‌లో ఈ పరీక్షలను ఉచితంగా చేయనున్నారు.

రూ.2 కోట్లతో సిటీ స్కానింగ్ యంత్రం

జిల్లా ఆసుపత్రిలో మూడున్నరేళ్లుగా సిటీ స్కానింగ్ యంత్రం పాడవడంతో ప్రజలకు స్కానింగ్ సేవలు దూరమయ్యాయి. ఎంతో మంది వినతులు మేరకు ఎట్టకేలకు రేడియాలజీ హబ్‌లో సిటీ స్కానింగ్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. హబ్‌లో సిటీ స్కానింగ్ యంత్రం ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ యంత్రం జర్మనీ నుంచి రావాల్సి ఉంది. యంత్రం రాగానే అమర్చి సేవలందించేందుకు వైద్యాధికారులు ఏర్పాట్లు చేశారు. సిటీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తే.. పేద ప్రజలకు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసే భారం తప్పుతుంది.

సేవలను వినియోగించుకోవాలి- డాక్టర్ సుగుణాకర్‌రాజు, జిల్లా జనరల్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

రేడియాలజీ హబ్‌లో ఇప్పటికే పలు అత్యాధునిక వైద్య పరీక్షలను ప్రారంభించాం. త్వరలో టుడీ-ఎకో, యూఎస్ స్కానింగ్ సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. సిటీ స్కానింగ్ యంత్రం జర్మనీ నుంచి రావాల్సి ఉంది. రాగానే యంత్రాన్ని అమర్చి సేవలను ప్రారంభిస్తాం. రేడియాలజీ హబ్ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలి.

# సతతం.. హరితం!

భూపాలపల్లి : గ్రామాలు, పట్టణాలు, పరిసరాలు పచ్చదనంతో నిండిపోయేలా తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.. గతంలో హరితహారాన్ని కొన్ని శాఖలకే పరిమితం చేసి కార్యక్రమం నిర్వహించడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడంలో కొంత వెనుకబడిన పరిస్థితి ఉంది. దీంతో ఈ సారి ప్రతి శాఖకు బాధ్యతలను అప్పగించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో హరితహారం కార్యక్రమం పక్కాగా నిర్వహించి విజయవంతం చేయడానికి కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటివరకు ఎనిమిది విడతల హరితహారం పూర్తికాగా ఈ ఏడాది తొమ్మిదో విడతకు శ్రీకారం చుట్టబోతున్నారు. 14.50 లక్షలు మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లాలోని అన్ని గ్రామాల్లో అటవీ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టి హరితహారం కార్యక్రమానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

అన్ని శాఖల భాగస్వామ్యంహరితహారం కార్యక్రమాన్ని కొన్ని శాఖలకే పరిమితం చేసి అమలు చేసేవారు. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరడంలో కొంత వెనుకబాటు ఉండటంతో కొన్నేళ్లుగా అన్ని ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేసి ప్రతి శాఖకు మొక్కల పెంపకం లక్ష్యాన్ని నిర్దేశించారు. దీంతో మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను చూసుకోవాల్సి ఉంటుంది. భూపాలపల్లి మున్సిపాలిటీ, జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ, సింగరేణి సంస్థ, పోలీస్ శాఖ, ఎక్సైజ్, విద్యాశాఖ, గిరిజన సమగ్రాభివృద్ధి శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ ఇలా తదితర శాఖలకు మొక్కల లక్ష్యం నిర్దేశించి మొక్కలు నాటేందుకు ముందస్తుగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమం విజయవంతానికి దిశానిర్దేశం చేశారు.

26 రకాల మొక్కలు

హరితహారం కార్యక్రమానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 241 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. జామ, ఉసిరి, అల్లనేరేడు, నిమ్మ, బొప్పాయి, సీతాఫలం, వేప, చింత, గన్నేరు, కానుగ గోరింట, రావి, వెలగ, మల్లె ఇలా పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే వివిధ 26 రకాల మొక్కలను జిల్లా వ్యాప్తంగా నర్సరీల్లో అందుబాటులో ఉంచుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ శాఖలకు లక్ష్యం నిర్దేశించి మొక్కలను పంపిణీ చేయడమే కాకుండా గ్రామాల్లో ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తామని సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలుపుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు అటవీశాఖకు సంబంధించిన నర్సరీల్లో మొక్కలను పెంచుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..- పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారితెలంగాణకు హరితహారంలో భాగంగా జిల్లాలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. అటవీ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నర్సరీలను ఏర్పాటు చేసి హరితహారానికి మొక్కలు అందించేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అవసరమయ్యే పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు అందుబాటులో ఉన్నాయి. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాల్వ, చెరువు గట్లపై గ్రామ పంచాయతీకి ఆదాయం ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటనున్నాం. రెండేళ్లలో గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చేలా మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోనున్నాం.

# నిధుల కోత.. పట్టణ ప్రగతికి వాత

నల్గొండ : జిల్లాలో పురపాలికలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాల కల్పనకు సరిపడా నిధులు లేక పట్టణాలు నీరసించిపోతున్నాయి. ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధుల్లో కోత పడటంతో పాలనలో మందగమనం చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి నెలా విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఫిబవరి 2020 నుంచి నిధులను పట్టణ ప్రగతి పేర విడుదల చేస్తుంది. ఆరంభంలో నిధులు పెద్ద మొత్తంలో మంజూరు కావడంతో పురపాలికల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ.. గత కొన్ని నెలలుగా నిధుల్లో కోత పడటంతో అభివృద్ధి కుంటుపడుతుంది.

ప్రధాన పనులకే కేటాయింపు..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మంజూరవుతున్న పట్టణ ప్రగతి నిధులు కేవలం ప్రధానమైన పనులకు మాత్రమే కేటాయిస్తున్నారు. సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, వైకుంఠధామాల నిర్మాణం, కార్మికుల వేతనాలు, వాహనాల కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించినా నెలకు సంబంధించిన నిధులు మాత్రమే పారిశుద్ధ్యం, ముళ్ల పొదలు తొలగింపు కార్యక్రమం చేపడుతున్నారు. కానీ.. వార్డుల్లో నెలకొన్న సమస్యలు రోడ్లు, వీధిదీపాలు, మురుగు కాల్వల నిర్మాణాలకు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో నల్గొండ



పట్టణంలో ముత్యాలమ్మకాలనీ, రెడ్డికాలనీ, పాతబస్తీ ప్రాంతాల్లో వరద కాల్వలు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మాణాలు నోచుకోవడంలేదు. అదే విధంగా శివారు కాలనీల్లో అంతర్గత రహదారులు దెబ్బతిన్నా మరమ్మతులు చేసే పరిస్థితి లేదు.

పట్టణ జనాభా పెరుగుతున్నా..పట్టణాల్లో జనాభా పెరుగుతున్నప్పటికీ నిధుల్లో కోత విధిస్తున్నారు. నల్గొండ జిల్లాకు ఫిబ్రవరి 2020–అక్టోబరు 2020వరకు రూ. 1.51కోట్లు విడుదల కాగా.. నవంబరు 2020 – జూన్ 2021వరకు రూ. 1.48కోట్లు, జులై 2021– మే 2022 వరకు రూ. 1.12కోట్లు మంజూరయ్యాయి. ఈ లెక్కలు చూస్తే రానురాను నిధుల్లో కోతపెడుతున్నారనేది స్పష్టమవుతుంది. దీంతో పట్టణాల అభివృద్ధికి ఆటంకంగా మారింది.

నిధుల్లో కోత వాస్తవమే: –రమణాచారి, కమిషనర్, నల్గొండ మున్సిపాలిటీగత కొన్ని నెలలుగా పట్టణ ప్రగతి నిధుల మంజూరులో తగ్గుదల వాస్తవమే. కానీ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటాల ప్రకారం నిధులు విడుదల చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్రం వాటా విడుదలైంది. నిధుల్లో కోత, తగ్గుదల అంశం ప్రభుత్వ స్థాయిలో ఉంటుంది. మరిన్ని నిధులు వస్తే మౌలిక సౌకర్యాల కల్పించేందుకు అవకాశం లభిస్తుంది.

# పౌరసేవ.. ఆన్‌లైన్ తోవ

మిర్యాలగూడ : పురపాలికల్లో ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందించేలా ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా పౌరసేవలు అందించేందుకు పురపాలిక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. పౌరసేవా కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని పురపాలిక శాఖ సంచాలకులు సత్యనారాయణ ఇటీవల ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పురపాలికల్లో అధికారులు ఈ తరహా పౌరసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత పురపాలికల్లో మేనేజర్‌లు ఉండగా , కొత్త పురపాలికల్లో రెవెన్యూ విభాగం వారికి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విదేశాల్లో ఉండే వారు సైతం తమ ఇళ్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ఆన్‌లైన్‌లో



ఫిర్యాదు చేయొచ్చు పురపాలిక కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరముండదు. నేరుగా సెల్‌ఫోన్‌లోనే ఫిర్యాదు చేస్తే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తారు. దీన్ని పురపాలిక ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. దీంతో కింది స్థాయి సిబ్బంది సకాలంలో స్పందించి సమస్య పరిష్కరిస్తారు.రాష్ట్రస్థాయిలో 'ఈ మున్సిపల్ డాట్ తెలంగాణ డాట్ జీవోవీ డాట్ ఇన్' వెబ్‌సైట్‌తో అన్ని పురపాలికలను అనుసంధానించనున్నారు. ఈ బాధ్యతను వీ– మాక్స్ ఈసొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి అప్పగించారు. ప్రతి పురపాలికలో మేనేజర్‌లను నోడల్ అధికారులుగా, కంప్యూటర్ నైపుణ్యమున్న వారిని సహాయ నోడల్ అధికారిగా నియమిస్తారు. ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేసి అందులో ఆయా పురపాలికల పూర్తి సమాచారం పొందుపరచాలని సూచించారు. పురపాలిక అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల వివరాలు ఫొటోలతో సహా నమోదు చేయాలి. అమృత్ పట్టణాలైతే వాటి నిధుల సమాచారం పేర్కొనాలి. పురపాలికల్లో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు చేయాల్సిన వివరాలు, పురపాలికల్లో జరిగే టెండర్ల సమాచారం ఇందులో ప్రదర్శిస్తారు.

ప్రజలకు సత్వర సేవలు
రవీందర్ సాగర్, కమిషనర్
పట్టణాల్లో వార్డుల సమస్యలు పురపాలిక కార్యాలయం వరకు వచ్చి ఫిర్యాదు చేసే అవసరముండదు. నేరుగా తమ ఫోన్‌లో ఫిర్యాదు చేయొచ్చు రాత్రి సమయంలో చేసిన ఫిర్యాదులు ఉదయం సంబంధిత పారిశుద్ధ్య, నీటి సరఫరా, విద్యుత్తు సిబ్బంది స్పందించే అవకాశముంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెబ్‌సైట్ రూపొందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

# సౌకర్యాలు లేని సంతలు..తొలగని చింతలు



ఆదిలాబాద్ :జిల్లా వ్యాప్తంగా రహదారులపై నిర్వహిస్తున్న వారసంతలతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో వీటిని నిర్వహించేందుకు ఉపాధి హామీ పథకం కింద పక్కా భవనాలు నిర్మించాలనే ఆదేశాలు జారీ అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందన లేకపోవడంతో ఆ దిశగా నిర్మాణాలు చేయడం లేదు. నేటికి అనేక గ్రామాల్లో వారసంతలను రహదారులపైనే నిర్వహిస్తుండడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పట్లేదు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షల రూపాయల వ్యాపారం కొనసాగుతున్న వారసంతలపై పంచాయతీలు చేస్తున్న నిర్లక్ష్యంపై కథనం.

పంచాయతీలకు ఆదాయం..
జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వారసంతలను ప్రధాన రహదారులపైనే నిర్వహిస్తున్నారు. అధికారికంగా కొన్నింటికే వేలం వేస్తున్న పంచాయతీలు నామమాత్రపు ఆదాయాన్ని పొందేలా వ్యవహరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. వారసంతలతో పంచాయతీలకు భారీగా ఆదాయం వస్తుండగా కనీస వసతులను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏటా నిర్వహించే వేలం దక్కించుకున్న గుత్తేదారులు వసతులు కల్పించకుండానే తైబజార్ ద్వారా రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకునేవారు లేరు.

నిధుల మంజూరుకు గతంలోనే ఉత్తర్వులు
ఉపాధిహామీ పథకం కింద పంచాయతీల్లో వారసంతల నిర్మాణానికి నిధులను కేటాయిస్తున్నారు. కేటగిరీ–1 కింద పెద్ద పంచాయతీకి రూ. 15 లక్షలు మంజూరు చేస్తారు. ఇందులో ఉపాధి హామీ పథకం నుంచి రూ. 10 లక్షలు, మరో రూ. 5 లక్షలు పంచాయతీ ద్వారా వెచ్చించి 30 దుకాణాలను నిర్మించేలా చర్యలు తీసుకుంటారు. కేటగిరీ–2 కింద చిన్న పంచాయతీకి రూ. 12.50 లక్షలు మంజూరుచేస్తారు. ఇందులో రూ. 9 లక్షలు ఉపాధిహామీ పథకం, మరో రూ. 3.50 లక్షలు పంచాయతీ ద్వారా మంజూరుచేసి 20 దుకాణాలను నిర్మించేలా గతంలోనే ఉత్తర్వులు జారీచేశారు. వీటి నిర్మాణానికి పంచాయతీలు ఆసక్తి చూపకపోవడంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. కనీస వసతులు, పక్కా భవనాలను నిర్మిస్తే ప్రజలకు మేలు కలగడంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. దీనికోసం ప్రజాప్రతినిధులు చొరవచూపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.వసతులు కల్పించాలని ఆదేశించాం నారాయణరావు, జిల్లా పంచాయతీ అధికారి, మంచిర్యాల పంచాయతీల్లో నిర్వహించే వారసంతల్లో కనీస వసతులు కల్పించాలని ఆదేశాలు జారీచేశాం. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మార్కెట్‌ల నిర్మాణానికి అవకాశం ఉంది. నిధులు, స్థలం ఉన్న ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది. పంచాయతీలు భవనాల నిర్మాణాల కోసం ముందుకురావాలి. పక్కా భవనాలు లేని ప్రాంతాల్లో తాత్కాలికంగా వారసంతలు నిర్వహిస్తున్నారు. సంతల్లో వీధిదీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వసతులకు ఆదేశించాం. సమస్యలు పంచాయతీల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

# ఇంధన కొరత.. కరెంటు కోత



తిర్యాణి : పెట్రోల్ బంకులు లేని ఏజెన్సీ మండలాలైన కెరమెరి, జైనూర్, తిర్యాణిలో నాణ్యమైన ఇంధనం అందించాలనే ఉద్దేశంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి చూపడంతో పాటు గిరిజనుల సౌకర్యార్థం బంకులు నిర్మించి వాటి నిర్వహణ బాధ్యతలు జీసీసీకి అప్పగించారు. జిల్లా మొత్తం బంకులు జీసీసీ మేనేజర్ పర్యవేక్షణలో ఉంటాయి. దీంతోపాటు ప్రతి బంకుకు ఒక మేనేజర్ ఉంటారు. మొదట్లో బాగానే నడిచిన బంకులు తర్వాత నిర్వహణ సరిగాలేకపోవడంతో గాడితప్పాయి. దీంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాగు పనుల వేళ ఇంధనం కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బంకుల్లో సమస్యలపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ధరలు పెరిగినా ఎప్పుడూ రద్దీగా ఉండే బంకులు ఇక్కడ మాత్రం వినియోగదారులకు పరీక్ష పెడుతున్నాయి. తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం, సాంకేతిక సమస్యలు, పెట్రోల్, డీజిల్ ఇంధన సరఫరాలో ఆలస్యం వంటి ఏదో ఒక సమస్య ఇక్కడ నిత్యకృత్యం అవుతోంది. ప్రత్యామ్నాయంగా బంకులు లేకపోవడంతో వినియోగదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి. ఇంధనం నిల్వలు అయిపోతే మళ్లీ రామగుండం నుంచి రావడానికి గంటలు లేదా రోజులు పడుతోంది.

ప్రైవేటుగా అధిక ధరలకు..
కెరమెరిలో ఒకటే బంకు కావడంతో ఇంధన కష్టాలు అన్నిఇన్ని కావు. సోలార్ జనరేటర్ ఏర్పాటు చేసినా పనిచేయడం లేదు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం పడినా, గాలి వీచినా గంటల తరబడి కరెంటు పోతోంది. బంకుల్లో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో వచ్చే వరకు నిరీక్షించక తప్పడం లేదు. మారుమూల గ్రామాల వారు పదుల కిలోమీటర్లు ప్రయాణించి బంకులకు వస్తే దొరకుతుందో లేదో తెలియని వింత పరిస్థితి. ఇదే అదనుగా కొంతమంది ప్రైవేటుగా అధిక ధరలను ఇంధనం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లేనిపక్షంలో జైనూర్ లేదా ఆసిఫాబాద్ బంకులకు వెళ్లాల్సిందే.

కనిపించని కనీస సౌకర్యాలు
గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్న ఈ బంకుల్లో మూత్రశాలలు, తాగునీటి వసతి వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయం. పర్యవేక్షణ లోపం, నిర్వహణ లేకపోవడంతో ఇలాంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధించిన అధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు

ఉన్నతాధికారులకు విన్నవించాం– పాపారావు, జీసీసీ మేనేజర్
బంకుల్లో వస్తున్న సమస్యలను సంబంధించిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. మా పరిధిలో ఏమీ లేదు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు చరవాణి ద్వారా సమాచారం అందించి పరిష్కరిస్తున్నాం.

పెట్రోల్ గ్యారెంటీ లేదు– రాంచందర్, రైతు, భీంపూర్, తిర్యాణి
బంకులో పెట్రోల్ ఎప్పుడు ఉంటుందో లేదో గ్యారెంటీ లేదు. ఒకసారి వస్తే కరెంట్ లేదంటారు. ఒక్కోసారి పెట్రోలే లేదంటారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగించేలా సోలార్ జనరేటర్‌కు మరమ్మతులు చేయాలి. లేదా కొత్తది ఏర్పాటు చేయాలి.

పకడ్బందీగా నిర్వహించాలి– రవి రాథోడ్, అనార్‌పల్లి, కెరమెరి
వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి. రోజుల తరబడి నిరీక్షించకుండా ఇంధనం సకాలంలో వచ్చేలా చూడాలి.

# ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే!

ఖమ్మం : స్థానిక సంస్థలకు చట్టబద్ధంగా రావాల్సిన సీనరేజి నిధులను రాష్ట్ర ప్రభుత్వం విదిల్చడంలేదు. మైనింగ్ శాఖ నుంచి జిల్లా పరిషత్‌కు ఏటా రూ. 50 కోట్ల మేర కేటాయిస్తోంది. ఈ మేరకు త్రైమాసికం వారీగా వివరాలతో లేఖలు పంపారు. కానీ ప్రభుత్వం రిక్తహస్తమే చూపుతోంది. వెరసి ఎనిమిదేళ్లలో ఖమ్మం జడ్పీ సుమారు రూ. 400 కోట్లు నష్టపోయింది. పర్యవసానం జడ్పీతోపాటు మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు నిధుల్లో కోత పడింది.

స్థానిక సంస్థలకు సీనరేజి నిధులు
పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి మైనర్ మినరల్స్ (చిన్న తరహా ఖనిజాలు) తవ్వి తీసే పరిశ్రమల నుంచి గనుల శాఖకు ఆదాయం వస్తుంది. అక్కడి నుంచి జడ్పీకి మంజూరవుతాయి. ప్రతి మూడు నెలలకు దామాషా అనుసరించి జడ్పీకి, గ్రామ పంచాయతీలకు 25 శాతం చొప్పున మండల పరిషత్‌లకు 50 శాతం చొప్పున కేటాయిస్తారు. వాటితో స్థానిక సంస్థల పాలక వర్గాలు వారి పరిధిలో అభివృద్ధి పనులు చేపడతాయి.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి సీనరేజి నిధులు అందటంలేదు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నపుడు ప్రతి త్రైమాసికంలో మైనింగ్ శాఖ నుంచి నేరుగా జడ్పీలకు జమయ్యేవి. అక్కడి నుంచి మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు వారి నిష్పత్తి ఆధారంగా నిధులు విడుదల చేసేవారు. 2014 తర్వాత మైనింగ్ శాఖ అన్ని జిల్లాల నుంచి సీనరేజి నిధులను నేరుగా స్థానిక సంస్థలకు జమ చేయకుండా 0853 హెడ్ ఆఫ్ అకౌంట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేస్తోంది.

పన్నుల రూపంలో ఆదాయం
జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. 150కి పైగా గ్రానైట్ క్వారీలు, 40 వరకు కంకర క్వారీలున్నాయి. గ్రానైట్ ముడి రాళ్లు కోత కోసి రాతి పలకలకు పాలిష్ పట్టే పరిశ్రమలు, కట్టర్లు 1500 వరకు ఉన్నాయి. ప్రతి నెల గ్రానైట్ క్వారీల్లో ముడి రాళ్లు వెలికితీసి విక్రయించేందుకు, పాలిష్ పట్టిన గ్రానైట్ పలకలు విక్రయించేందుకు మైనింగ్ శాఖ అనుమతులు ఇస్తుంది. పర్మిట్లు జారీకి ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తారు. వాటి నుంచి స్థానిక సంస్థలకు సీనరేజి నిధులు కేటాయిస్తారు.

అభివృద్ధి పనులపై ప్రభావం
ప్రతి త్రైమాసికానికి స్థానిక సంస్థలకు కేటాయిస్తున్న సీనరేజి నిధులు, ఆయా పరిశ్రమలు చెల్లించిన పన్నుల వివరాలతో నివేదికను మైనింగ్ శాఖ అధికారులు జడ్పీ అధికారులకు లేఖలు పంపుతున్నారు. సీనరేజి నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జడ్పీకి నిధులు విడుదల చేయటంలేదు. దీంతో స్థానిక సంస్థల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మండల పరిషత్ కార్యాలయాల్లో అయితే కనీసం కరంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి నెలకొంది.

జడ్పీకి కేటాయింపు (రూ.కోట్లలో)

| | |
|---|---|
| 2020–21 | 39.30 |
| 2021–22 | 48.96 |

గ్రానైట్, కంకర పరిశ్రమలకు అనుమతులు జారీ చేసే సమయంలోనే పన్నుల రూపంలో ఆయా హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు డబ్బు జమ అవుతుంది. ప్రతి త్రైమాసికం వారీగా సీనరేజి నిధుల వివరాలు జడ్పీకి అందిస్తాం.

# కనిపించని పెరటి తోటలు..

తలమడుగు : ఇక్కడ కనిపిస్తున్న పెరటితోట తలమడుగు మండలం కజ్జర్ల–2 అంగన్‌వాడీ కేంద్రంలోనిది. ఇక్కడ అనువైన స్థలం ఉండటంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులను దృష్టిలో పెట్టుకుని సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సొర, బీర, చిక్కుడు, కొత్తిమీర, మెంతి వంటివి పండిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నారు. వేసవిలో మాత్రం నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా 2018లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం కోసం కేంద్రాల పరిధిలోని కార్యకర్తలు ఖాళీ స్థలాల్లో పెరటి తోటలను(న్యూట్రీ గార్డెన్లు) ఏర్పాటు చేయాలి. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించి వాటిని వండి ఆహారంగా అందించాలి. అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో ఎక్కడా అనువైన స్థలాలు లేకపోవడంతో ఆచరణ అంతంత మాత్రంగానే ఉంది. ఫలితంగా ప్రభుత్వ ఆశయం



నీరుగారుతోంది.

జిల్లా వ్యాప్తంగా 18 మండలాలకుగాను 1256 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 530 కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ల స్థలాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ ప్రస్తుతం 35లలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇక్కడ టీచర్లు సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండిస్తున్నారు. పెరటితోటలో కూరగాయలు పండించడమే కాకుండా తమ పరిధిలోని మహిళలు, ప్రజలకు సేంద్రియ పంటలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ కార్యకర్తలు న్యూట్రీ గార్డెన్‌పై శ్రద్ధ కనబర్చడం లేదు. ఈ క్రమంలో కేంద్రాల్లో స్థల సమస్య, నీరు తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని కిచెన్‌గార్డెన్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వమే కార్యకర్తలకు టమాట, వంకాయ, సొర, బీర, మెంతి, కొత్తిమీర, పాలకూర వంటి విత్తనాలను అందించింది. కొవిడ్ మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత కూడా ఖాళీ స్థలాలు ఉన్న వాటిల్లోనూ పెరటితోటల ఏర్పాటుకు కార్యకర్తలు ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, ఎలుకలు, పలు చోట్ల నీటి సమస్యలతో తోటలను నిర్వహించలేకపోతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో స్థలాలు ఉన్నచోట పెరటి తోటలను ఏర్పాటుచేస్తే సేంద్రియ ఆకు, కూరగాయలతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక దృష్టి– ఐసీడీఎస్ పీడీ మిల్కా, ఆదిలాబాద్
జిల్లాలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండటంతో పాటు ఖాళీ స్థలాలు ఉన్నవాటిలో కచ్చితంగా పెరటితోటల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందుకు తగ్గట్లుగా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేరుస్తాం.

# అటకెక్కిన ఆత్మ

ఖమ్మం : వ్యవసాయం లాభసాటిగా మారాలంటే అన్నదాతలకు ఆధునిక పరిజ్ఞానం అవసరం. దీనికోసం వారిని క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లాలి. అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ఇందు కోసం ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆత్మ'(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ)కు నిధుల్లేక పథకం ఉద్దేశం నీరుగారిపోతోంది. అసలు ఈ పథకం ఉంటుందా లేదాననే అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది.

నిధుల్లేక విజ్ఞాన యాత్రలు, సదస్సులు బంద్
ఏటా ఒక్కో జిల్లా నుంచి రూ. 50లక్షల వరకు ప్రతిపాదనలు పంపుతారు. వీటిలో రూ. 15లక్షల నుంచి రూ. 20లక్షల వరకు మంజూరు చేస్తారు. గత మూడేళ్ల నుంచి చిల్లిగవ్వ మంజూరు చేయకపోవటంతో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడంలేదు. వానాకాలం సీజన్ మొదలైనప్పటికీ విజ్ఞాన ప్రదర్శన జాడే లేదు.

బ్లాకుల్లో సైతం ఇదే పరిస్థితి
జిల్లాలోని ఐదు వ్యవసాయ డివిజన్ల స్థానంలో ఐదు బ్లాక్ టెక్నాలజీ కార్యాలయాలున్నాయి. ఒక్కో దానిలో ఒక బీటీఎం, ఇద్దరు ఏటీఎంలు ఉండాలి. కూసుమంచిలో ఇద్దరు ఏటీఎంలు, వైరాలో ఒక ఏటీఎం, ఖమ్మంలో ఒక బీటీఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడా కూడా సరిపోయినంత మంది సిబ్బంది లేకపోవటంతో పరిస్థితి దారుణంగా ఉంది.

ఇవీ... లక్ష్యాలు వ్యవసా, అనుబంధ శాఖల విస్తరణ విభాగాలు బలోపేతం చేయటం. లి ప్రణాళిక అమల్లో రైతులను భాగస్వామ్యం చేయటం. లి పరిశోధన, విస్తరణ, మార్కెటింగ్, రైతుల లింకేజీలు.. లి పంటల వారీగా గ్రూపులను ఏర్పాటు చేయటం, వాటిని బలోపేతం చేయటం. లి రైతులకు ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు సందర్శనలు. లి విజ్ఞాన యాత్రలు నిర్వహించటం, రైతు గ్రూపులకు రివాల్వింగ్ నిధులు, ప్రోత్సాహకాలు అందజేయటం.

ఉద్దేశం: జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖలు పాడి, పట్టు, మత్స్య, ఉద్యాన, సామాజిక అడవులు, రైతు సంఘాలు, ఎన్‌జీవోలు సమన్వయంతో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి సహకరించటం.

సిబ్బంది లేక ఇబ్బంది
ప్రాజెక్టులో ఒక పథకసంచాలకుడు, ఉపసంచాలకుడు, సీనియర్ అసిస్టెంట్, ఒక కాంపోనెంట్ ఉండాలి. ప్రస్తుతం ఒక్క సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 'ఆత్మ' పథక సంచాలకురాలిగా డీఏవో ఎం. విజయనిర్మల ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ప్రస్తుతం మా ప్రాజెక్టు ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే విజ్ఞాన యాత్రలు, అవగాహన సదస్సులు చేపడతాం. –ఎం. విజయనిర్మల, సంచాలకురాలు, ఖమ్మం




కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటర్లు విస్పష్టమైన ఆధిక్యాన్ని కట్టబెట్టారు. 2004 నుంచి ఆ పార్టీకి స్థాయి మెజార్టీ రావడం రెండోసారి. ఈ సారి ముఖ్యమంత్రి స్థానానికి పార్టీకి చెందిన దిగ్గజ నేతలు పోటీపడుతున్నారు. ఈ రేసులో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ ముందంజలో ఉన్నారు. మోదీ-బసవరాజ్ బొమ్మైలతో కూడిన భాజపా డబులింజన్ సర్కారుకు నినాదానికి పోటీగా సిద్ధరామయ్య-డీకే శివకుమార్ ద్వయం ఎదురొడ్డి నిలిచి విజయం సాధించింది. ఇప్పుడు కన్నడనాట రాజకీయం ఉత్కంఠగా మారింది. 2013లో శివకుమార్‌కు తన మంత్రి వర్గంలో స్థానం ఇవ్వడానికి కూడా సిద్ధరామయ్య కొన్ని నెలలపాటు అంగీకరించలేదు. అప్పటికే డీకే కేపీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు కూడా. అలాంటిది ఇప్పుడు అతడితో కలిసి ముఖ్యమంత్రి పదవికి పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరి సానుకూల ప్రతికూలాంశాలు..

**కన్నడనాట అతిపెద్ద నాయకుడిగా సిద్ధరామయ్య..** కర్ణాటక రాజకీయాల్లో బీఎస్ యడియూరప్ప, సిద్ధరామయ్య అతిపెద్ద నాయకులు. ఇప్పుడు యడ్డీ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దీంతో సిద్ధరామయ్యకు ఎదురులేదు. ఇటీవల నిర్వహించిన ప్రతి ముందస్తు సర్వేలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అభ్యర్థిగా తొలిస్థానంలో నిలిచారు. ఈయనకు బాధ్యతలు అప్పగిస్తే ప్రజాతీర్పునకు అనుగుణంగా ఎంపిక చేసినట్లు అవుతుంది. కురబ సామాజిక వర్గానికి చెందిన సిద్ధరామయ్య కాంగ్రెస్ వ్యూహాలకు తగిన 'అహింద' (మైనార్టీ, బీసీ, ఎస్సీ) సామాజిక సమీకరణలకు కూడా అతికినట్లు సరిపోతారు. 2013లో ముఖ్యమంత్రిగా ఐదేళ్లపాటు నిరాటంకంగా పాలించిన అనుభవం కూడా ఆయనకు ప్లస్‌పాయింట్‌గా మారింది. దీంతోపాటు ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనడం ఇదే చివరి సారి అని సిద్ధ ప్రకటించడంతో హస్తం అధినాయకత్వం ఆయనకు అవకాశం ఇవ్వవచ్చు. ముఖ్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రధాని మోదీ జోరుకు అడ్డుకట్ట వేయాలంటే సిద్ధరామయ్య వంటి నేతకే కాంగ్రెస్ అధినాయకత్వం మొగ్గు చూపే అవకాశం ఉంది. సిద్ధరామయ్యకు ప్రతికూలాంశాలు కూడా ఉన్నాయి. ఆయన పాలనలోని కీలక పోస్టింగ్‌ల్లో కురుబ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తారనే అపవాదు ఉంది. ఇలాంటి పోకడలే వక్కలిగ, లింగాయత్ సామాజిక వర్గాలను పార్టీకి దూరం చేశాయని విమర్శలు ఎదుర్కొన్నారు. దీంతోపాటు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యకర్తలను విడుదల చేయడం విమర్శలకు దారితీసింది.

**దూకుడుకు మారుపేరు డీకే..** కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఈ సారి ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో దూసుకు వెళుతున్నారు. తొమ్మిది సార్లు ఓటమి అనేది లేకుండా అసెంబ్లీకి ఎన్నికైన ఆయన మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో ఈ రేసులో పోటీ పడుతున్నారు. ట్రబుల్ షూటర్‌గా ఆయనకు కాంగ్రెస్ వర్గాల్లో పెద్ద పేరుంది. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఒకప్పటి రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ రాజ్యసభ ఎన్నికలో శివకుమార్ కీలక పాత్ర పోషించారు. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన ఆంతరంగికుల్లో శివకుమార్ కూడా ఒకరు. ఆయనది వక్కలిగ సామాజిక వర్గం. కర్ణాటకలోనే అత్యంత సంపన్న రాజకీయ వేత్తగా ఆయన నిలిచారు. హస్తం పార్టీకి అవసరమైన విరాళాల సేకరణలో శివకుమార్‌దే కీలక పాత్ర. 2019 లోక్ సభ ఎన్నికల్లో కన్నడనాట ఉన్న 28 సీట్లలో కాంగ్రెస్ కేవలం ఒకటి మాత్రమే సాధించింది. అది కూడా డీకే సోదరుడు సురేష్ గెలిచిన స్థానం. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. దర్యాప్తు సంస్థల దాడులు, అరెస్టులకు ఎదురొడ్డి నిలిచి 2023లో పార్టీకి అధికారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ముఖ్యమంత్రి పీఠం అందుకోవడానికి ఆ కేసులే అడ్డుగా నిలిచే అవకాశం ఉంది. ఆయనపై సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలు పలు కేసులు నమోదు చేశాయి. 104 రోజులు తిహాడ్ జైల్లో గడిపివచ్చారు. ఇప్పుడు ఆయన సీఎం పీఠం ఎక్కితే పాత కేసుల్లో విచారణలు సమయంలో పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయనే భయాలున్నాయి. కాంగ్రెస్ పార్టీ వీరిద్దరు కాకుండా మూడో వ్యక్తిని కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిత్వానికి పరిశీలించే అవకాశాలు లేకపోలేదు. మాజీ ఉపముఖ్యమంత్రి జి.పరమేశ్వర వంటి నేతల పేర్లు కూడా ఈ రేసులో వినిపిస్తున్నాయి. పరమేశ్వర రాష్ట్రంలోని బలమైన వర్గం ఎస్సీలకు చెందినవారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించే అవకాశం లేకపోలేదు.




కర్ణాటక విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. అత్యధిక స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు అభ్యర్థుల తరపున సినీ నటులు ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలుగు హాస్యనటుడు బ్రహ్మానందం కూడా ఎన్నికల ప్రచారం చేశారు. భాజపా అభ్యర్థి, మంత్రి డాక్టర్ కె.సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని తెలుగులో విన్నవించారు. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాల్లో సుధాకర్ ఓటమి పాలయ్యారు.

చిక్కబళ్లాపుర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ ఈశ్వర్ 11,130 ఓట్ల మెజార్టీతో సుధాకర్‌పై విజయం సాధించారు. ఈ ఫలితాల్లో ఈశ్వర్‌కు 69,008 ఓట్లు రాగా, సుధాకర్‌కు 57878 ఓట్లు మాత్రమే పడ్డాయి. జేడీఎస్ అభ్యర్థి కేపీ బచే గౌడ 13,300 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మంత్రి సుధాకర్‌తో తనకు మొదటి నుంచి పరిచయం ఉండడం, వైద్యునిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు తెలిసి ప్రచారానికి వచ్చానని అప్పుడు బ్రహ్మానందం చెప్పారు. చిక్కబళ్లాపురలో నటుడు దర్శన్, లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్‌లతో కలిసి సుధాకర్ రోడ్‌షోలో పాల్గొన్నారు.

**హీరో నిఖిల్ గౌడ ఓటమి..** ప్రస్తుత ఎన్నికల్లో కింగ్ మేకర్‌గా అవతరిస్తుందనుకున్న జేడీఎస్ తనదైన ప్రభావాన్ని చూపలేకపోయింది. 20 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో కీలక నియోజకవర్గంగా రామనగర కూడా నిలిచింది. అందుకు కారణం మాజీ సీఎం కుమారస్వామి తనయుడు హీరో నిఖిల్ గౌడ అక్కడి నుంచి పోటీ చేయడమే. 'జాగ్వర్'తో ఇక్కడ తెలుగువారికీ నిఖిల్ గౌడ సుపరిచితుడే. తాజా ఎన్నికల్లో కుమారస్వామి భార్య రామనగర నుంచి టికెట్‌ను త్యాగం చేసి తనయుడు నిఖిల్ కుమారగౌడకు అవకాశం ఇచ్చారు. దీంతో రామనగర స్థానంలో నిఖిల్ గౌడ (జేడీఎస్) ఇక్బాల్ హుస్సేన్ (కాంగ్రెస్) మరిలింగగౌడ (భాజపా) పోటీపడ్డారు. ఈ త్రిముఖపోరులో కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ హుస్సేన్ దాదాపు 10వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. హుస్సేన్‌కు 87,285 ఓట్లు రాగా, నిఖిల్ గౌడకు 76,439 ఓట్లు వచ్చాయి. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ హుస్సేన్‌పై జేడీ(ఎస్) అభ్యర్థి హెచ్‌డీ కుమారస్వామి విజయం సాధించగా, ఇప్పుడు ఆయన తనయుడు ఓటమి పాలయ్యారు. 2019లో మండ్య లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో పోటీ చేసిన నిఖిల్.. సుమలత చేతిలో ఓడిపోయారు. అటు సినీ కెరీర్, ఇటు రాజకీయ రంగంలోనూ నిఖిల్ తనదైన ముద్రవేయలేకపోయారు.

**గాలి కుటుంబానికి నిరాశ మిగిల్చిన ఎన్నికలు :** తాజా ఎన్నికల ఫలితాలు వివాదాస్పద మైనింగ్ వ్యాపారి గాలి జనార్దనరెడ్డి కుటుంబానికి తీవ్ర నిరాశను మిగిల్చాయి. జనార్ధనరెడ్డి మినహా పోటీలో ఉన్న కుటుంబసభ్యులెవరూ విజయం సాధించలేదు. ఆయన సోదరులు సోమశేఖరరెడ్డి, కరుణాకర్?రెడ్డి భాజపా తరపున పోటీ చేయగా.. భార్య లక్ష్మీ అరుణ, జనార్దనరెడ్డి సొంత పార్టీ కల్యాణ రాజ్యప్రగతి పక్ష అభ్యర్థులుగా బరిలో నిలిచారు. బళ్లారి పట్టణ నియోజకవర్గంలో గాలి సోదరుడు సోమశేఖరరెడ్డి (భాజపా), భార్య లక్ష్మీ అరుణ(కేఆర్‌పీపీ)లను కాదని కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డికి ఓటర్లు విజయాన్ని అందించారు. హరపనహళ్లి నియోజకవర్గం నుంచి భాజపా తరపున పోటీ చేసిన కరుణాకర్ రెడ్డి.. ప్రత్యర్థి లతా మల్లిఖార్జున్ (కాంగ్రెస్) చేతిలో ఓటమిపాలయ్యారు. మరోవైపు ఆయన సన్నిహితుడు మాజీ మంత్రి శ్రీరాములు సైతం కాంగ్రెస్ అభ్యర్థి నాగేంద్ర చేతిలో ఓడిపోయారు. కల్యాణ రాజ్యప్రగతిపక్ష పేరుతో పార్టీని స్థాపించి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచారు గాలి జనార్ధన్‌రెడ్డి. అయితే, తాజా ఫలితాల్లో ఆయన ఒక్కరే విజయం సాధించడం విశేషం. గంగావతి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్? అభ్యర్థి ఇక్బాల్ అన్సారీపై గెలుపొందారు. బళ్లారి సిటీ నియోజకవర్గంలో తన సోదరుడు, భాజపా నేత సోమశేఖరెడ్డిపై భార్య లక్ష్మీని కేఆర్?పీపీ అభ్యర్థిగా పోటీకి దింపగా ఇద్దరూ పరాజయం పాలయ్యారు. గాలి కుటుంబానికి కంచుకోటగా ఉన్న బళ్లారి పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్ రెడ్డి విజయం సాధించడం గమనార్హం.

## రాష్ట్రాన్ని లూటీ చేసి రాజశ్యామల యాగం చేస్తారా?

విజయవాడ: పొత్తులుంటే ఓటమి తప్పదని సీఎం జగన్‌కు, వైసీపీ నాయకులకు అర్థమైందని పోతిన జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట మహేష్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ ఒక్క మాట మాట్లాడితే వైసీపీ మంత్రులు మొత్తం ఉలిక్కిపడి బయటికి వచ్చి మీడియా సమావేశాలు పెడుతున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ కనపడితే తాడేపల్లి ప్యాలెస్ ఎందుకో వణికి పోతుందన్నారు. వైసీపీకి దండం పెట్టి ఈ పార్టీలో తాము ఉండలేం ఇలాంటి నియంతృత్వ పాలన చూడలేదని




ఎమ్మెల్యేలు వెళ్లిపోతున్నారని.. దీనిపై వైసీపీ మంత్రులు స్పందించాలన్నారు. సజ్జల సలహాలతో రాష్ట్రం సర్వనాశనమైందని మండిపడ్డారు. సజ్జల అవినీతి సీఎం జగన్‌ను మించి పోయాలా ఉందని వ్యాఖ్యలు చేశారు. అధర్మ అవినీతి అరాచక పాలనకు ప్రతిరూపం సీఎం జగన్ అన్నారు. రాష్ట్రాన్ని లూటీ చేసి రాజశ్యామల యాగం చేస్తారా అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం జగన్ ముమ్మాటికి కాపు వ్యతిరేకి అని... పవన్ కళ్యాణ్‌పై స్పందిస్తున్న కాపు మంత్రులు కాపు ద్రోహులన్నారు. కాపుల అభివృద్ధి సంక్షేమం రిజర్వేషన్లపై సీఎం జగన్‌ను ప్రశ్నించే దమ్ము కాపు మంత్రులకు ఉందా అని పోతిన వెంకటమహేష్ ప్రశ్నించారు.

## శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి మంచి ఆదరణ

విజయవాడ: నగరంలో ప్రభుత్వం చేపట్టిన శ్రీ లక్ష్మీ మహాయజ్ఞానికి మంచి ఆదరణ వస్తోందని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... చరిత్రలో ఎవరు చేయలేని యజ్ఞాన్ని ప్రభుత్వం తలపెట్టిందని తెలిపారు. వేలాది మంది భక్తులు యజ్ఞంలో పాల్గొంటున్నారన్నారు. భక్తులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. దేవాదాయ శాఖ



ఆధ్వర్యంలో యజ్ఞాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని.. అన్ని శాఖల సమన్వయంతో యజ్ఞం జరుగుతుందని చెప్పారు. మొదటి యాగశాలలో పాంచరాత్రం ఆగమనంలో రిత్వికులు పవిత్రంగా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారన్నారు. నాలుగు ఆగమనాలకు సంబంధించి.. అత్యుత్తమైన యాగాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. తమిళనాడు రిత్వికులు కూడా యజ్ఞంలో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు మంచి జరగాలని యజ్ఞాన్ని తలపెట్టామన్నారు. సీఎం జగన్ మొదటిరోజు సంకల్పం తీసుకున్నారని... ఆఖరి రోజు పూర్ణాహుతిలో యజ్ఞఫలాన్ని సీఎం జగన్‌కు దారబోస్తారని అన్నారు. సీఎం జగన్ ఈ యజ్ఞఫలాన్ని ప్రజలకు అందిస్తారని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు.




విజయవాడ: కర్నాటకలో కాంగ్రెస్ విజయంతో ఏపీలోని ఏఐసీసీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ తదితరులు టపాసులు కాల్చి.. స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల ఫలితాలు బీజేపీకి చెంప పెట్టు అన్నారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కర్నాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అద్భుతమైన విజయం అందించారన్నారు. ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి ఖర్గే ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీతో సహా ఎంతోమంది పెద్దలు టీం వర్కు చేశారని, అందరూ సమిష్టి ప్రణాళికతో ఈ విజయం వరించిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ మరింత పుంజుకుంటోందని, 2024 ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గృహజ్యోతు, గృహ లక్ష్మి, అన్నదాత, యువ నిధి, మహిళా శక్తి పథకాలు ప్రజల్లోకి బాగా తీసుకెళ్లారని, కాంగ్రెస్ హామీలను అమలు చేస్తుందనే నమ్మకంతోనే ప్రజలు ఓట్లు వేశారని గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రజల్లో, కాంగ్రెస్‌లో మంచి జోష్ వచ్చిందన్నారు. మధ్య తరగతి ప్రజలపై పడిన భారాలు ఈ ఎన్నికలలో ఓట్లు ప్రభావం కనిపించిందన్నారు. ప్రధాని మోదీ స్వయంగా రోడ్ షోలు చేసినా ప్రజలు నమ్మలేదని, భవిష్యత్తులో జరిగే ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్ ఘడ్ ఎన్నికలలో కాంగ్రెస్‌కు మంచి ఆదరణ ఉంటుందని గిడుగు రుద్రరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.



మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. రాష్ట్రపతిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.

## అవినాశ్ రెడ్డి అరెస్ట్ కాకుండా అడ్డుకుంటున్న అజ్ఞాతశక్తి ఎవరు?..




అమరావతి: ఎంపీ అవినాశ్ రెడ్డి  అరెస్ట్ కాకుండా అడ్డుకుంటున్న అజ్ఞాతశక్తి ఎవరు? ఆయన ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్  రెడ్డే కదా? అని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు వర్ల రామయ్య ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అధికారాన్ని జగన్ అడ్డుపెట్టుకొని, రాష్ట్ర సంక్షేమాన్ని విస్మరించి, అల్లకల్లోలంగా మారిన రైతుల వ్యథలు పట్టించుకోకుండా, తమ్ముడు అవినాశ్ రెడ్డిని రక్షించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని, అవినాశ్ అరెస్ట్ ఎప్పుడని నిలదీశారు. అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయకుండా సీబీఐ ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతోందన్నారు. 'నిన్ హైడ్రిన్ టెస్ట్' పూర్తయితే వివేకా రాసినట్టు చెప్పబడుతున్న లేఖపైన అసలు వేలిముద్రలు బయటపడతాయని, ఇంకొంతమంది ముద్దాయిలు వెలుగులోకి వస్తారన్నారు. వివేకా కూతురు డాక్టర్ సునీత ఓ వీరవనితని, చరిత్రలో రాణిరుద్రమ, ఝాన్సీరాణి పోరాటం చేసిన శత్రువుల కంటే పెద్ద శత్రువుతో సునీత చేస్తున్న పోరాటం చరిత్రలో నిలుస్తుందని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయడంతోనే వివేకాహత్య కేసు ముగిసిపోయినట్టు కాదని, ఇంకా విచారణ చేయాల్సింది చాలా ఉందన్నారు. కుట్ర బయటకు తీయాలని, హూ కిల్డ్ బాబాయ్‌లోని ముద్దాయిలంతా బయటపడాలన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణరక్షణ కోసం, ప్రివెన్షన్ అండ్ డిటెన్షన్ ఈ రెండు సూత్రాలపై పోలీస్ శాఖ పనిచేయాలి.. కానీ ఆంధ్రాలో జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పోలీస్ శాఖ తద్భిన్నంగా పనిచేస్తోందని విమర్శించారు. 2020లో అమెరికాలో జార్జ్ ఫ్లాయిడ్ అనే నల్లజాతీయుణ్ణి చంపిన పోలీస్ అధికారి అలెగ్జాండర్‌కు తాను ఏమీ తీసిపోను అన్నవిధంగా నిన్న కావలి డీఎస్పీ వెంకటరమణ తన రెండు మోకాళ్ల మధ్యలో ఆందోళనచేస్తున్న బీజేపీ కార్యకర్త సురేశ్ తలను నొక్కడం హత్యాయత్నంతో సమానమన్నారు. అమెరికాలో పోలీస్ అధికారి అలెగ్జాండర్‌కు శిక్షపడినట్టే, ఇక్కడ సురేశ్‌పై హత్యాయత్నం చేసిన డీఎస్పీ వెంకటరమణకు శిక్షపడాలని డిమాండ్ చేశారు. కావలి డీఎస్పీ వెంకటరమణను వెంటనే అరెస్ట్ చేసి, దిగజారిపోతున్న మీ ప్రభుత్వ ప్రతిష్టను కొంతైనా కాపాడుకోండి. కొంతమంది పోలీస్ అధికారుల తీరు చాలా ఘోరాతిఘోరంగా ఉందని, వారు చట్టబద్ధంగా వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ హెచ్చరిస్తోందని వర్ల రామయ్య పేర్కొన్నారు.

## పవన్ స్పెషల్ ప్యాకేజీ కోసం పొత్తులు పెట్టుకుంటాడు



విజయవాడ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శలు గుప్పించారు. పవన్ కళ్యాణ్ ఒక అపరిపక్వ నాయకుడుగా మిగులుతాడన్నారు. పవన్ స్పెషల్ ప్యాకేజీ కోసం పొత్తులు పెట్టుకుంటాడని విమర్శించారు. ఎవరి అజెండాను పవన్ అమలు పరచాలనుకుంటున్నాడని ప్రశ్నించారు. జనసైనికుల ఆశల మీద పవన్ నీళ్ళు చల్లాడన్నారు. పవన్‌ను నమ్మిన వాళ్ళని దగా చేశాడని చెల్లుబోయిన విమర్శించారు. పవన్ చేసిన పనితో 2014-19 లో ప్రజలు నష్టపోయారని పవన్ ఆత్మసాక్షికి తెలియాలన్నారు. 2014-19 లో జరిగిన తప్పుల్లో పవన్ వాటాదారుడు కావాలన్నారు. రైతుల దగ్గరకు వెళ్ళి కొంగజపం చేస్తున్నారన్నారు. ప్రకృతి వలన వచ్చిన కష్టాలను వికృతంగా చూపించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పవన్ స్వతంత్రంగా గెలవలేడని.. ఏ లక్ష్యాలతో పవన్‌కు జనసైనికులు మద్దతిచ్చారో అది చేయలేనని పరోక్షంగా చెప్పాడని మంత్రి చెల్లుబోయిన పేర్కొన్నారు.

## తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద రైతులు-పోలీసుల మధ్య తోపులాట



అమరావతి: రాజధాని పరిధిలోని తుళ్లూరులో అమరావతి రైతుల దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా 'జైభీమ్' పార్టీ వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు అంబేడ్కర్ స్మృతివనం వద్దకు రైతులు బయల్దేరగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. దీంతో కొంతమంది రైతులు శిబిరం వెనుకవైపు పొలాల నుంచి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని నిలువరించారు. ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. పొలాల వెంట వెళున్నవారితో పాటు శిబిరం నుంచి బయటకు వచ్చిన కొందరు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో శిబిరం వద్ద రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల వైఖరిపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చాలా సార్లు ఆ చేదు అనుభవం.. రకుల్ ఆవేదన

సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టాలి అనుకున్న అమ్మాయిలకు ఆరంభంలో చాలా అవమానాలు.. ఇబ్బందులు తలెత్తుతూ ఉంటాయి. ఇప్పుడు కాస్త పర్వాలేదు కానీ ఒకప్పుడు మరీ దారుణంగా హీరోయిన్ అవ్వాలి అనుకున్న అమ్మాయిలను వాడుకునే వారు. అవమానించే వారు అంటూ టాక్ ఉండేది. ఇప్పుడు ఇండస్ట్రీలో ఉన్న కొంత మంది హీరోయిన్స్ తమ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి చెప్తే ఆశ్చర్యం వేయక మానదు. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అప్పటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా చూపిస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో చాలా సార్లు సినిమాల్లో ఎంపిక చేసుకుని కొన్నాళ్ల పాటు షూటింగ్ నిర్వహించి



చెప్పకుండానే తొలగించి మరో హీరోయిన్ తో షూట్ చేసేవారు. అలా చాలా సార్లు చేదు అనుభవం ఎదురయ్యిందని రకుల్ ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేసింది. ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన వాళ్లకు అవకాశాలు వచ్చినట్లే వచ్చి చేజారుతాయి అంటూ రకుల్ పేర్కొంది. ఆత్మ విశ్వాసంతో అడుగులు వేశాను కనుకే ఈ స్థాయికి నేను చేరుకున్నాను. ఎప్పుడు కూడా ఇండస్ట్రీ లో అవకాశాలు కానీ మరేదైనా కానీ ఈజీగా దొరకాలని నేను కోరుకోలేదు అంటూ రకుల్ పేర్కొంది. కొత్తగా వచ్చే అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో ప్రయత్నించాలని ఆమె సూచించింది.

## అందాల లావణ్య సొగసు చూడతరమా

అందాల రాక్షసి ఫేం లావణ్య త్రిపాఠి హీరోయిన్ గా వరుస ఆఫర్లు దక్కించుకోలేక పోయినా కూడా సుదీర్ఘ కాలంగా కెరీర్ లో కొనసాగుతూ వస్తోంది. తెలుగు లేదా ఇతర భాషల్లో అప్పుడో ఇప్పుడో ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతోంది. గత ఏడాది హ్యాపీ బర్త్ డే అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లావణ్య త్రిపాఠి ప్రస్తుతం ఒకటి రెండు చిన్న సినిమాలు చర్చల దశలో ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి.

ఈ ఏడాదిలో ఒకటి రెండు సినిమాలతో అయినా లావణ్య త్రిపాఠి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సినిమాలు తక్కువ ఉన్నా కూడా



సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ప్రదర్శణ చేస్తూ.. క్యూట్ ఫొటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్న ముద్దుగుమ్మ లావణ్య త్రిపాఠి కి పాపులారిటీ మరింత పెరుగుతూనే ఉంది. తాజాగా ఈ క్యూట్ ఫొటోను షేర్ చేసిన లావణ్య త్రిపాఠి మరోసారి తన అభిమానుల దృష్టిని ఆకర్షించింది. స్కిన్ షో చేయకున్నా కూడా లావణ్య త్రిపాఠి యొక్క అందం గురించి మాట్లాడుకునే విధంగా ఉంటుంది. ఫుల్ లెంగ్త్ లెహంగాలో అందాల లావణ్య యొక్క సొగసు చూడతరమా అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




## శ్రద్ధగా పరువాలన్నీ ఆరబోస్తున్న ముద్దుగుమ్మ





తెలుగు హీరోయిన్లుగా తెలుగు వారి కంటే ఎక్కువగా ఉత్తరాది వారే క్లిక్ అవుతూ ఉంటారు. అయితే అదే సెంటిమెంట్ని నమ్ముకుని చాలామంది ఉత్తరాది భామలు తెలుగు హీరోయిన్లుగా రాణించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ ఉంటారు. అలాంటి వారిలో శ్రద్ధ దాస్ కూడా ఒకరు. అల్లరి నరేష్ హీరో నటించిన సిద్దు ఫ్రం శ్రీకాకుళం అనే సినిమాతో హీరోయిన్గా మారిన ఈ భామ ఆ తర్వాత అనేక తెలుగు తమిళ కన్నడ మలయాళం సినిమాల్లో కూడా నటించింది. ఇవన్నీ కాక హిందీలో కూడా కొన్ని సినిమాల్లో నటించింది. అయితే ఇవేవీ ఆమెకు క్రేజ్ అయితే తీసుకురాలేకపోయాయి. ఎప్పటికప్పుడు ఒక మంచి ప్రాజెక్ట్ చేసి హీరోయిన్గా నిలదొక్కుకుందాం అని చేస్తున్న ప్రయత్నాలు.. ఆమెకి ఏమాత్రం ఫలించకపోవడంతో ఇక ఏ అవకాశం వచ్చినా కాదనకుండా చేసుకుంటూ వెళ్ళిపోతుంది. ఆ మధ్య ఒక బోల్డ్ వెబ్ సిరీస్లో కూడా కనిపించి ఒక్కసారిగా అందరికీ షాక్ ఇచ్చింది. ఇక అప్పటినుంచి అందాల ఆరబోతలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాను అన్ని రకాల పాత్రలకు సై అని హింట్ ఇచ్చే విధంగా ఆమె చేస్తున్న అంగంగా ప్రదర్శన ఇప్పుడు అందరికీ షాక్ ఇస్తోంది. తాజాగా శ్రద్ధాదాస్ ముంబైలో తన స్వగృహంలో టైం గడుపుతోంది. పండుగ సందర్భంగా ఇంటికి వెళ్లిన ఆమె... తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ ఫోటోలో ఆమె వెస్టన్ డ్రెస్ ధరించమే కాకుండా సంప్రదాయబద్ధంగా చీర కట్టుకొని కనిపించింది. అయితే ఆ చీరకట్టులో కూడా తన అందాలను బహిర్గతం చేసింది. అలా చీరలో తన అందాలను చూపిస్తూ... అభిమానులను టీజ్ చేస్తూ కనిపించింది. చీరకట్టులో తన బొడ్డును చూపిస్తూ రెచ్చిపోయింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆమె ధరించిన జాకెట్టు కూడా కాస్త భిన్నంగా ఉండడంతో ఆమె ఎద అందాలన్నీ బయటకి కనిపించేలా ఉన్నాయి. ఇక ఆమె పెట్టిన పోస్టు కేవలం మగ ఫ్యాన్స్ మాత్రమే కాదండోయ్... లేడీ ఫ్యాన్స్ కూడా ఈ హాట్ న్యూస్ తట్టుకోలేకపోతున్నాం బాబోయ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## అది ఒళ్ళా.. విల్లా? అనుష్కా



రబ్ నే బనాదీ జోడీ అనే సినిమాతో అనుష్క శర్మ బాలీవుడ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాలో షారుఖ్ కు జోడిగా నటించింది. ఆ సినిమాలో ఆమె యాక్టింగ్ తో విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకుంది. దీంతో ఆమెకు వరుస సినిమాల ఛాన్స్ లు వచ్చాయి. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అనుష్క శర్మ... స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. అప్పటినుంచి వరుస సినిమాలు చేస్తూ... హవా చూపిస్తోంది. ఈ తరుణంలోనే టీమిండియా క్రికెటర్ విరాట్ కోహ్లీతో ప్రేమలో పడింది. కొంతకాలం రహస్యంగా లవ్ ట్రాక్ నడిపిన ఈ జోడి... కొన్నేళ్ల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుని ఒకటయ్యారు. విరాట్ ను పెళ్లి చేసుకున్న తర్వాత కూడా అనుష్క శర్మ సినిమాల్లో నటించింది. అయితే 2021 లో ఈ జోడీ ఓ పాపకి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. వీరు పాపకు వామికా అని పేరు పెట్టారు. దీంతో ఆమె రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగానే ఉంటూ వచ్చింది. చాలా కాలం పాటు వరస సినిమాలు చేసిన అనుష్క శర్మ... కొంత కాలం ఖాళీగానే ఉంది. కానీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటూ వస్తుంది. ఈ క్రమంలో తన వ్యక్తిగత సినీ కెరియర్ కు సంబంధించిన విషయాలను పంచుకుంటూ... ఫ్యాన్స్ ను పెంచుకునే పనిలో పడింది. తాజాగా తన శరీరాన్ని విల్లులా వంచి ఉన్న ఫోటోని ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేసింది. దానికి పర్స్పెక్టివ్ అనే క్యాప్షన్ ఇచ్చింది. చూసిన ఫ్యాన్స్.. కామెంట్ బాక్స్ లో లవ్ సింబల్స్ వర్షాన్ని కురిపిస్తున్నారు. ఇక ఈ భామ త్వరలో సినిమాల్లో వచ్చేందుకు సిద్ధమవుతోంది.

## పఠాన్ సెన్సార్ కట్స్ పై క్రేజీ హీరోయిన్ ఫైర్!

దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత షారుక్ ఖాన్ నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించాడు. దీపిక పదుకునే హీరోయిన్ గా నటించిన ఈ మూవీలో జాన్ అబ్రహం విలన్ గా నటించాడు. యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్ పై ఆదిత్య చోప్రా అత్యంత భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సినిమా ఇది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ మూవీని జనవరి 25న అత్యంత భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. హిందీతో పాటు ఈ మూవీని తెలుగు తమిళ భాషల్లోనూ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సెన్సార్ వారు సినిమా చూశారు. యు/ఏ సర్టిఫికెట్ ని ఇచ్చారు. రన్ టైమ్ ని కూడా కుదించారని తెలిసింది. 'పఠాన్' ఫైనల్ రన్ టైమ్ 146.16 (రెండు గంటల 26 నిమిషాల 16 సెకన్లు). ఇక సోషల్ మీడియాలో వివాదాస్పదంగా మారిన వైరల్ గా మారిన



'బేషరమ్ రంగ్' సాంగ్ పాటకు మూడు కట్స్ విధించారట. దీపిక పదుకునే అందాల ఆరబోతపై వచ్చిన విమర్శల్ని దృష్టిలో పెట్టుకున్న సెన్సార్ బోర్డ్ దీపిక గోల్డెన్ స్విమ్ సూట్ లో వున్న మూడు క్లోజప్ షాట్స్ కు కొన్ని డ్యాన్స్ మూవ్ మెంట్స్ లలో మార్పులు చేశారట. టోటల్ గా ఈ మూవీకి 10 కట్స్ విధించినట్టుగా తెలుస్తోంది. అంతే కాకుండా పలు సంభాషణల్లోనూ సూచనలు చేసినట్టుగా చిత్ర బృందం తెలిపింది. రిలీజ్ సమయానికి సెన్సార్ వారు చెప్పిన మార్పులతో సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ వెల్లడించారు. సినిమా రిలీజ్ కు మరో నాలుగు రోజులే వుండటంతో చిత్ర బృందం ప్రమోషన్స్ ని స్పీడప్ చేసింది. ఇక దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ సినిమాలో వున్న యాక్షన్ ఘట్టాలపై ఈ సందర్భంగా వెల్లడించాడు. పఠాన్ లోని యాక్షన్ ఘట్టాలు ఒళ్లు గగుర్పొడిచే విధంగా వుంటాయని అవి వెండితెరపై చూస్తే అద్భుతంగా అనిపిస్తాయన్నాడు. అయితే ఈ మూవీ సెన్సార్ వారు 10 కట్స్ విధించడంపై హీరోయిన్ శ్రేయాస్ ధన్వంతరీ తీవ్రంగా స్పందించింది. ఇది హాస్యాస్పదంగా వుందని సెన్సార్ సభ్యులపై తీవ్ర స్థాయిలో మండిపడింది. మా అద్భుతమైన ప్రేక్షకులకు వారు ఏమి చూడాలనుకుంటున్నారో నిర్ణయించే శక్తిని ఇవ్వండి. వారికి ఏదైతే నచ్చకపోతే వారే టికెట్ లు కొనరు. ఈ హాస్యాస్పదమైన సెన్సార్ షిప్ ని ఆపేయండి' అంటూ శ్రేయాస్ ధన్వంతరి సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ఫైర్ అయింది.

## సీనియర్ స్టార్ హీరోయిన్ కూతురు తెరంగేట్రం సూపర్ అప్డేట్

బాలీవుడ్ ప్రేక్షకులతో పాటు సౌత్ సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన రవీనా టాండన్ ఇప్పటికి కూడా మంచి ఫాలోయింగ్ ను కలిగి ఉన్న విషయం తెల్సిందే. రవీనా టాండన్ కు పెద్ద కూతురు ఉంది అనే విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ఇంకా మూడు పదుల వయసులో ఉన్నట్లుగా రవీనా టాండన్ కనిపిస్తూ ఉంటుంది. రవీనా టాండన్ యొక్క కూతురు రాషా టాండన్ అతి త్వరలోనే ఇండస్ట్రీలో అడుగు పెట్టబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. గత రెండు సంవత్సరాలుగా హీరోయిన్ గా పరిచయం అవ్వడానికి కావాల్సిన కసరత్తులను రాషా టాండన్ చేస్తోంది. రాషా టాండన్ ఇప్పటికే కొన్ని కథలు విన్నదని.. ఆమె హీరోయిన్ గా ఎంట్రీ



ఇవ్వబోతున్న సినిమా కన్ఫర్మ్ అయ్యిందని వార్తలు వస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం సుశాంత్ సింగ్ రాజ్ పూత్ మరియు సారా అలీ ఖాన్ జోడీగా నటించిన కేదార్నాథ్ సినిమా యొక్క దర్శకుడు అభిషేక్ కపూర్ దర్శకత్వంలో రాషా టాండన్ హీరోయిన్ గా పరిచయం కాబోతుందట.

ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభం అయ్యిందని తెలుస్తోంది. బాలీవుడ్ నుండి వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ముద్దుగుమ్మ ఎంట్రీ ఇవ్వబోతున్న సినిమాలో స్టార్ హీరో అజయ్ దేవగన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడట. మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటీ అంటే ఇదే సినిమా తో ఆమన్ దేవగన్ ను పరిచయం చేయాలని కూడా భావిస్తున్నారట. ఈ ఏడాది సమ్మర్ వరకు ఈ సినిమాపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# కర్ణాటక ఫలితాలు.. దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతాయి: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ప్రభావం చూపుతాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రేతో గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కుట్రలు, కుతంత్రాలతో జేడీఎస్‌ను గెలిపించి, హంగ్ అసెంబ్లీ ఏర్పాటు చేయడం ద్వారా భాజపా మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తన రాజకీయ పబ్బం గుడపుకోవాలనుకున్న కేసీఆర్‌ను కర్ణాటక ప్రజలు తిరస్కరించారు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్న కుమారస్వామిని కర్ణాటకకు ముఖ్యమంత్రిని చేయాలని కేసీఆర్ ప్రకటించారు. కుమారస్వామి కర్ణాటకకు ముఖ్యమంత్రి కావాలంటే.. కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో హంగ్ ఏర్పడాలి. హంగ్ ఏర్పడినప్పుడే జేడీఎస్ పాత్ర అక్కడి రాజకీయాల్లో క్రియాశీలకమవుతుంది" అని రేవంత్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ పార్టీ గెలవొద్దని ప్రయత్నించిన ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్‌ల ఆలోచనలను కర్ణాటక ప్రజలు విస్పష్టంగా తిరస్కరించారు. హైదరాబాద్ కర్ణాటకలోని మెజార్టీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అక్కడి ప్రజల జీవన విధానంలోనే కాదు.. ఆలోచన సరళిలోనూ ఇక్కడి ప్రజలు పోలి ఉంటారు. కర్ణాటక ఫలితాలే తెలంగాణలోనూ పునరావృతం కాబోతున్నాయి. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో మొదటి విజయం హిమాచల్ ప్రదేశ్‌లో, రెండో విజయం కర్ణాటకలో. మూడో విజయం తెలంగాణలో సాధించబోతున్నాం. 2024లో ఫైనల్‌లోగా దిల్లీలో కాంగ్రెస్ జెండా ఎగరేయబోతున్నాం. కర్ణాటకలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు ఉత్సాహంగా కలిసిమెలిసి ఎన్నికలను ఎదుర్కొన్నారు. అహంకారం ఒకవైపు, అవినీతి సొమ్ము మరో వైపు పెట్టుబడిగా పెట్టి భయపెట్టడం ద్వారా కాంగ్రెస్‌ను ఓడించాలని నరేంద్రమోదీ, భాజపా చేసిన కుట్రలను కన్నడ ప్రజలు తిప్పికొట్టారు. తెలంగాణలోనూ సీఎం కేసీఆర్ అహంకారం, అవినీతి సొమ్ముతో ఇతర రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి ఏదో ఒకరకంగా అధికారాన్ని మూడోసారి నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటే అని ప్రజలు భావిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

# కర్ణాటక ఎన్నికల ఫలితాలు.. తెలంగాణపై ప్రభావం చూపవు: కేటీఆర్



హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంపై తెలంగాణ మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ విజయంపై కేటీఆర్ స్పందిస్తూ.. " 'ది కేరళ స్టోరీ'.. కర్ణాటక ఓటర్లపై ప్రభావం చూపించడంలో పూర్తిగా విఫలమైంది. అదే మాదిరిగా కర్ణాటక ఎన్నికల ఫలితాలు కూడా తెలంగాణపై ఎలాంటి ప్రభావాన్ని చూపించబోయేది లేదు. నీచమైన, విభజన రాజకీయాలను తిరస్కరించిన కర్ణాటక ప్రజలకు నా కృతజ్ఞతలు. పెట్టుబడులు ఆకర్షించడం, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో హైదరాబాద్, బెంగళూరు నగరాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. అది దేశానికి మంచి చేసేలా ఉండాలి. కర్ణాటక కొత్త ప్రభుత్వానికి నా శుభాకాంక్షలు" అని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# తెలంగాణ దశాబ్ది వేడుకలపై సీఎం కేసీఆర్ సమీక్ష

తెలంగాణ ఆవిర్భావ దిశాబ్ది వేడుకల నిర్వహణపై సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు. వేడుకలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలి ? ఎప్పటి నుంచి నిర్వహించాలి ? విషయమై నిర్ణయించనున్నారు. ఉత్సవాలు, బహిరంగసభ తదితర అంశాలపై అధికారులతో సీఎం చర్చిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్లవుతున్న సందర్భంగా నెల రోజుల పాటు వేడుకలను నిర్వహించాలని, హైదరాబాద్ నగరంలో వారం రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు నిర్వహించాలని భావిస్తున్నారు. అమరుల త్యాగాలు స్మరించుకోవడం సహా తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని కళ్లకు కట్టేలా కార్యక్రమాలు జరుపాలని చూస్తున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులతో సీఎం చర్చించన్నారు.





కొండగట్టులో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో హెూమం, సుందరకాండ పారాయణం, అభిషేకం నివేదన, తీర్థ ప్రసాద వితరణ చేశారు.



కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఆధిక్యంలో కొనసాగుతుండటంతో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రెడ్‌హిల్స్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గదను బహూకరించారు.

# సీఎం కేసీఆర్ పాలనలోనే దేవాలయాల అభివృద్ధి : మంత్రి తలసాని

తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ పాలనలో దేవాలయాలు ఎంతో అభివృద్ధి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేట ఎస్పీరోడ్‌లోని హనుమాన్ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, అధికారులు మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత నూతన పాలకమండలి సభ్యులతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం పాలకమండలి సభ్యులు కృషి చేయాలని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక దేవాలయాలను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని, భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. బల్కంపేట, సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, అమీర్ పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం, గణేశ్ దేవాలయం ఇలా అనేక దేవాలయాల లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. చరిత్రలోనే గొప్పగా నిలిచిపోయేలా యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, బేగంపేట డివిజన్ %దీ=హా% అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.




కరీంనగర్: కర్ణాటక ఎన్నికల ఫలితాలపై భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనైనా అక్కడి పరిస్థితుల ప్రభావం ఉంటుందని, కర్ణాటకలో భాజపా ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదని చెప్పారు.

ఒక రాష్ట్రంలో వచ్చిన ఫలితాల ప్రభావం మరో రాష్ట్రంపై ఉంటుందనుకోవడం సరికాదన్నారు. గత ఎన్నికల్లో భాజపాకు 36 శాతం ఓట్లు వచ్చాయని, ఈసారి కూడా 36శాతం ఓట్లు పోలయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటింగ్ 38 నుంచి 43 శాతానికి పెరిగిందన్నారు. జేడీఎస్ ఓటింగ్ షేర్ 20 నుంచి 13శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. "అన్ని పార్టీలు కలిసి భాజపాను ఎదుర్కొన్నాయి. కర్ణాటకలో మత రాజకీయాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే. ఆ పార్టీకి మద్దతిచ్చిన కేసీఆర్.. కర్ణాటకలో పెద్దన్న పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం ఓట్లతో గెలిచింది. ఎస్‌డీపీఐ, ఎంఐఎంలు కాంగ్రెస్‌కు సపోర్టు చేశాయి. తెలంగాణలో ఐదు ఉప ఎన్నికలు జరిగితే రెండింటిలో భాజపా గెలిచింది. మునుగోడులోనూ మేమే గెలిచినట్టు లెక్క. కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదు. జీహెచ్‌ఎంసీలో 4 నుంచి 48 సీట్లకు వచ్చాం. ఒక్క రాష్ట్రంలో గెలవగానే కేంద్రంలో అధికారంలోకి వస్తారా? తెలంగాణలోనూ మా ఓటింగ్ శాతం పెరిగింది. కర్ణాటక క్యాంపు రాజకీయాలు సీఎం కేసీఆర్ అండతోనే హైదరాబాద్‌లో పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయం. దమ్ముంటే కర్ణాటకలో ప్రకటించినట్లుగా నాలుగు శాతం రిజర్వేషన్ సహా, భజరంగ్‌దళ్‌ను నిషేదిస్తామని తెలంగాణలో చెప్పగలరా? కేసీఆర్‌కు తెలియకుండా హైదరాబాద్‌లో క్యాంపు రాజకీయాలు నడుస్తాయా? వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, భారాస కలిసి పోటీ చేస్తాయి" అని బండి సంజయ్ అన్నారు.




బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ గెలుపు ఖరారైంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర చీఫ్ డీకే శివకుమార్ ఉద్వేగానికి గురయ్యారు. కర్ణాటకలో పార్టీని గెలిపిస్తానని సోనియాగాంధీకి మాట ఇచ్చానని చెప్పారు. 'కర్ణాటకలో పార్టీని విజయతీరాలకు చేర్చుతానని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేకు మాట ఇచ్చాను. నేను జైల్లో ఉన్నప్పుడు సోనియా గాంధీ నన్ను కలవడానికి వచ్చారు. దానిని నేనెప్పటికీ మర్చిపోలేను' అని డీకే ఉద్వేగానికి గురయ్యారు. అలాగే ముఖ్యమంత్రి పదవికి ప్రధాన అభ్యర్థి ఎవరని మీడియా ప్రశ్నించగా..'కాంగ్రెస్ కార్యాలయమే మా దేవాలయం. అక్కడే మేం తదుపరి నిర్ణయం తీసుకుంటాం. ఈ సందర్భంగా సిద్ధరామయ్యతో సహా అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని అన్నారు.

**డబ్బు, అధికారం పనిచేయలేదు: ఖర్గే :** 'ప్రజలు స్వయంగా వచ్చి, మాకు మద్దతు తెలిపారు. అవినీతి పాలనకు వ్యతిరేకంగా వారు ఓటేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, ఇతర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చి ఇక్కడ ప్రచారం నిర్వహించారు. అధికారం, డబ్బు ఉపయోగించారు. కానీ ప్రజలు మాత్రం కలిసికట్టుగా మాకే ఓటేశారు. ఇది సమష్టి విజయం' అని మల్లికార్జున ఖర్గే సంతోషం వ్యక్తం చేశారు.

**ఇది కాంగ్రెస్‌కు భారీ విజయం: సిద్ధూ –**'ఇది కాంగ్రెస్‌కు పెద్ద విజయం. భాజపా ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకున్నారు. 2018లో ఆపరేషన్ కమలంపై భాజపా భారీగా ఖర్చు చేసింది. ఇది భాజపా అగ్రనేతలు నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డాకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు. మోదీ కర్ణాటకకు 20 సార్లు వచ్చారు. ఏ ప్రధాని ఈ తరహాలో ప్రచారానికి రాలేదు. విద్వేష రాజకీయాలను ప్రజలు ఉపేక్షించరు. డబ్బుతో ఎన్నికల్లో గెలవాలన్న భాజపా కుట్ర ఫలించలేదు' అని సిద్ధరామయ్య విమర్శించారు. అలాగే 2024లో రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు.




కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేల్చుతూ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనూ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

# అన్నదాతకే అన్నం పెట్టడం పూర్వజన్మ సుకృతం : మంత్రి గంగుల

లోకానికే అన్నంపెట్టే అన్నదాతకే అన్నం పెట్టడం పూర్వజన్మ సుకృతమని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులు పస్తులు ఉండొద్దనే ఉద్దేశంతో మంత్రి సొంత డబ్బులతో కరీంనగర్ ఏఎంసీ పాలకవర్గం రైతులకు మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టింది. శనివారం కార్యక్రమంత్రి మంత్రి గంగుల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు ఏఎంసీ రైతులకు భోజనం అందిస్తున్న పాలకవర్గాన్ని అభినందించారు. ఉమ్మడి పాలనలో ఎన్నో కష్టాలు పడ్డామని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారాయన్నారు.

కాళేశ్వరం జలాలను తీసుకువచ్చి మండుటెండల్లో మత్తడులు దూకుతున్నాయని, ఈ ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో బీడు భూములన్నీ సాగులోకి వచ్చాయని, భూమికే బరువయ్యేలా పంటలు పండుతున్నాయన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పండిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామన్నారు. తెలంగాణ పచ్చగా ఉండడం, రైతులు సంతోషంగా ఉండడం చూసి ఢిల్లీ పార్టీలు విషం చిమ్ముతున్నాయని ఆరోపించారు. ఢిల్లీ గద్దలు ఇక్కడి నీటిని, బొగ్గు, కరెంటును దోచుకుపోయి మళ్లీ తెలంగాణ గుడ్డిదీపం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని, తెలంగాణ రక్షకుడిగా సీఎం కేసీఆర్ వారిపై యుద్ధం చేస్తున్నారన్నారు. తెలంగాణ రక్షకుడు కేసీఆర్ మాత్రమేనని, ఆయనకు అండగా ఉంటూ తెలంగాణ కాపాడుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

# కేసీఆర్ హంతకుడు.. ఒకేరోజు ముగ్గురిని పొట్టనబెట్టుకున్నాడు

హైదరాబాద్ : సీఎం కేసీఆర్ ఒక హంతకుడని.. ఒకేరోజు ముగ్గురిని పొట్టన పెట్టుకున్నాడని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. డిగ్రీ చదివి నాలుగేళ్లయినా ఉద్యోగం రాక శివకుమార్ ఉరి వేసుకున్నాడన్నారు. 20 రోజులైనా వడ్లకు కాంటాలు వేయక రైతు యల్లయ్య గుండె ఆగిందన్నారు. 15రోజులుగా సమ్మె చేస్తున్నా.. సర్కారు స్పందించక జీపీ కార్యదర్శి సోనీ తనువు చాలించిందని షర్మిల పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డల ప్రాణాలు తీసుకుంటున్నా.. కేసీఆర్ దొరకు దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందన్నారు. కొలువులు లేక పుట్టెడు దు:ఖంతో యువత ఉందన్నారు. వడ్లు కొనక కన్నీటి వ్యధతో రైతులున్నారని షర్మిల పేర్కొన్నారు.

"ఉద్యోగ భరోసా లేక మనస్తాపంతో కార్యదర్శులు.. చచ్చిపోతున్నా కనికరించవా కేసీఆర్? ఇంకెంతమంది ఉసురు తీసుకుంటావ్? నీ కుటుంబానికి పదవులు కావాలె! మా బిడ్డలకు ఉద్యోగాలు వద్దా? నీ కుటుంబం ఆస్తులు సంపాదించుకోవాలె! మా రైతులు అప్పులు తీర్చుకోవద్దా? నీ కుటుంబం కోట్లకు పడగలెత్తాలె! మా బిడ్డలు పాడె ఎక్కాల్నా? ఇంకా నువ్ ఎందుకు బతికున్నట్టు కేసీఆర్? బంగారు తెలంగాణ పేరుతో ఆత్మహత్యల తెలంగాణగా మార్చావు కదా?" అని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com